ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
03 జులై, 2011



ENTERED



₹ 15 కే పసందైన భోజనం

హ్యాపీ బర్త్‌డే

(2011 జులై 3 నుంచి
2011 జులై 9 వరకు)

వి. నీహారిక
జులై-4
లక్ష్మి-తాతబాబు
రాంపురం-విశాఖ

టి. అభినయ్
10సం॥, జులై-5
భారతి-నర్సింహ
ఎం.పి. పటేల్‌గూడ-రంగారెడ్డి

పి. మహేష్
జులై
బేబి-పరశురాం
ఎం. వెంకటాయపాలెం-ఖమ్మం

టి. శ్రీచందన
1సం॥, జులై-2010
హైమవతి-విజయ్‌కుమార్
కూకట్‌పల్లి-హైదరాబాద్

రిశిక
6సం॥, జులై-2005
సుగుణ-సుందరరాజు
భద్రాచలం-ఖమ్మం

ఆహ్వానం

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశ పడుతున్నారా! అయితే ఆలస్యం ఎందుకండి! మీ బాబు- పాప పేరు , పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు , తల్లిదండ్రుల వివరాలు రాసి అన్నట్టు కలర్ ఫొటో జత చేయడం మరువకండి. అయితే మీ చిన్నారి ఫొటో వివరాలను 15 రోజుల ముందుగానే మాకు అందేవిధంగా పంపగలరు.

మా చిరునామా
హ్యాపీ బర్త్‌డే, ప్రజాశక్తి ప్లాట్ నెం. 21/1,
ఎం.హెచ్ భవన్
ఆజమాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి,
హైదరాబాద్-500 020
email-
venkateshcartoon@gmail.com

మనలో మాట

లక లక లక...

నిజం నిప్పు లాంటిది. ఊహ పరిమితమైనది. అయితే ఆ ఊహలనే నిజమని నమ్మేవారూ వున్నారు. నాడు రాతి యుగంలోనే కాదు. నేటి రాకెట్ యుగంలోనూ. సినిమా అంటేనే ఊహలకు పట్టం కట్టడం. కల్పిత పాత్రలతో తెరకెక్కించడం. లేనివి వున్నట్టుగా.. జరగనివి జరిగినట్టుగా... జరుగుతున్నట్టుగా... ప్రేక్షకులను భయపెట్టడం ఇవాళ సినిమా ట్రెండుగా వుంది. అలా వెండితెర ద్వారా ప్రేక్షకుల బుర్రల్లో తిష్ట వేసుక్కూర్చున్నదే 'చంద్రముఖి'. ఆత్మ ప్రయోగంతో వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీసు బద్దలు కొట్టింది. ఇదే కాదు! జేజెమ్మ కథతో వచ్చిన 'అరుంధతి' బిగ్గెస్ట్ హిట్ కొట్టింది. కాలభైరవ కాన్సెప్ట్‌తో వచ్చిన 'మగధీర' కాసుల పంట పండించింది. రెండు జన్మల గాధలు, ప్రతీకారంతో రగిలిపోయే ఆత్మలు ఈ చిత్రాల ద్వారా ఆకట్టుకున్నాయి. ఇందులో అన్నీ ఊహల ఊసులే. కల్పిత గాధలే. కానీ 'అన్నీ నిజాలే...' అనుకునేంత వరకు వెళ్లిపోయారు ప్రేక్షకులు.

'చంద్రముఖి'కి భాషాప్రాంతీయ బేధాలు లేవు. మలయాళం (శోభన), కన్నడ (సౌందర్య), తెలుగు (జ్యోతిక), హిందీ (విద్యాబాలన్) లో సైతం చంద్రముఖి అనే ఆత్మ క్యారెక్టర్ ప్రేక్షకులకు దగ్గరైంది. అదీ ఎంతగానంటే...కల్పిత పాత్రగా సినిమాలో ప్రవేశపెట్టిన చంద్రముఖి నిజ జీవితంలో ఆ పాత్రలను చేసిన వారిపై పగ తీర్చుకుంటోందంటగా! అనుకునేంతగా!! అంతటితో ఆగలా!!! ఎన్నో పుకార్లు పుట్టించేశారు. విమానాల్లో షికార్లు చేయిస్తున్నారు. కన్నడలో 'ఆప్తమిత్ర' (చంద్రముఖి) నిర్మాణ దశలోనే అనేక బాలారిష్టాలను ఎదుర్కోవాల్సి రావడం కూడా దాని ఫలితమేనన్నారు. ఎలాగోలా పూర్తయిందని ఊపిరి పీల్చుకునేలోగానే మరో పుకారు. ఆ చిత్రం విడుదలకు ముందే చంద్రముఖిగా నటించిన సౌందర్య అర్ధాంతర మరణానికి కారణం అదేనన్నారు. అదిగో పులి అంటే ఇదిగో తోక అనేవారికేం కొదవ! అందులో రజనీకాంత్ పాత్ర పోషించిన కన్నడ నటుడు విష్ణువర్ధన్ నిద్రలోనే చనిపోవడం కూడా అందువల్లేనన్నారు. ఇప్పుడు తాజాగా చంద్రముఖి హిట్ లిస్టులో రజనీ వున్నాడని పుకార్లు. అందుకే తరచూ జబ్బు పడుతున్నారని ప్రచారాలు. అంతటితో ఊరుకోలా! చంద్రముఖి ఆత్మ పగప్రతీకారాల నుంచి బైట పడడానికి ఆయన ప్రత్యేక పూజలు, హోమాలు, యాగాలు చేయించారని కూడా ప్రచారం. ఆ భయంతోనే తెలుగులో 'చంద్రముఖి'కి సీక్వెల్‌గా తీసిన 'నాగవల్లి'లో నటించకుండా రజనీ జాగ్రత్తపడ్డారని కూడా గాసిప్. ఇహ ఇంటర్నెట్‌లో అయితే రజనీపై చంద్రముఖి పగకు సంబంధించిన వార్తలెన్నో సర్క్యులేట్ అవుతున్నాయి. ఒకానొక దశలో రజనీ చనిపోయాడని కూడా ప్రచారంలో పెట్టేశారు. వాటిని ఖండిస్తూ సూపర్‌స్టార్ కుటుంబ సభ్యులు ప్రకటనలు ఇచ్చుకోవాల్సి వచ్చింది.

ఇదే విచిత్రం అంటే! చంద్రముఖి ఆత్మను సినిమా కథలో భాగంగా సృష్టించారు. అద్భుతమైన సాంకేతిక పరిజ్ఞానంతో తెరకెక్కించారు. సినిమా సూపర్ డూపర్ హిట్ అయ్యేంతగా ట్విస్టులు మీద ట్విస్టులు పెట్టారు. ఇప్పుడు అదే మూఢనమ్మకం ఎల్లలు లేని ఇంటర్నెట్‌లో ప్రచారం చేస్తున్నారు. కత్తిని ఆపరేషన్ చేసి ప్రాణం పోయడానికీ వాడొచ్చు. హత్య చేసి ప్రాణం తీయడానికీ వాడొచ్చు. టెక్నాలజీ కూడా అంతే! ఆత్మలూ, గత జన్మలూ నిండిన 'అరుంధతి, మగధీర, చంద్రముఖి' సృష్టించొచ్చు. 'రోబో'లనూ తయారుచేయొచ్చు. వివేకం...వివేచన చేయాల్సింది మనమే.

★

ఈ సంచికలో....

టపా	...	2
పొట్టిమనిషి	...	3
ఈ పేజ్	...	5
కవిత్వమ్	...	6
నవ్వుల్ పువ్వుల్	...	7
సినిమా కబుర్లు	...	8
రుచి	...	11
చూద్దామా	...	12
అట్టమీది కథ	...	14
వికాసం	...	20
కొత్త పుస్తకాలు	...	21
బాలనేస్తాలు	...	22
మాటల కోట	...	24

ఇంకా...

వ్యామమం ఎందుకు?...4

చోటా రాజన్ బడా డాన్...10

కథ ... 18

నల్ల కలువ



వరప్రసాదం

అట్టమీదికథ 'నల్లమల పులుల సామ్రాజ్యం' విశ్లేషణాత్మకంగా, విలువైన సమాచారాన్నిచ్చేదిగా ఉంది. అరువు అందాల నడుమ 'బొటాక్స్' పాత్ర చాలా ఉందని అర్థమౌతోంది. నాగినేని లీలాప్రసాద్ గారి కథ 'ధర్మం' ఆసాంతం చదివించింది. వికాసం 'మనసు మాట'లో చివర్న వాస్తవికతతో ఆలోచించేవారు జీవిత మాధుర్యాన్ని, చతురతను, సృజనాత్మకతను అందుకోగలరని ఉంటే బాగుండేది. కొత్తపుస్తకాలులో 'తెలుగు ప్రముఖులు', 'గోదావరి గాథలు' పుస్తక పరిచయ భాగ్యం కలిగింది. 'బాలనేస్తాలు'లో 'పెద్దల సంతకం', చేసేద్దాం, విహంగం వంటి అంశాలు మాకెంతో నచ్చాయి. హుస్సేన్ చిత్రరాజాలను చూస్తుంటే వారి ప్రతిభాపాటవాలే కళ్లముందు కదలాడాయి. 'జ్ఞాపకాలు' ద్వారా అందించిన సునీత్ చోప్రా రచన హుస్సేన్ అభిమానులకు వరప్రసాదంలాంటిది. 'సినిమా కబుర్లు' వల్ల తెలుగులో అనువాద చిత్రాలకు అరవై ఏళ్లయిందని ద్యోతకమైంది. ఇప్పటికైనా 'మెగా' లీడర్ గుణపాఠాన్ని నేర్చుకోగలిగితే, మంచి నాయకుడవడానికి అవకాశం ఉందనిపించింది.

నేమాన సుభాష్ చంద్రబోస్,
శ్రీకాకుళం.

చక్కటి సలహాలు

12వతేదీ నాటి ఆదివారం అనుబంధం సర్వాంశ ప్రబంధంగా విలసిల్లింది. ఇందులో ముఖ్యంగా కవర్‌స్టోరీ 'బుజ్జి బొజ్జకు..' అంటూ బడి తెరిచిన వేళ తల్లిదండ్రులకు ఎన్నో మంచి సలహాలను చెప్పిన డాక్టర్‌గారికి అభివందనలు. ఈ వ్యాసంలోని ప్రతి ఒక్క అంశం చిన్న పిల్లలకే కాక, వారి తల్లులకు ఉపయోగపడేలా వుంది. వారికి తగిన సలహాలు, సూచనలు ఇచ్చి, ఎన్నో ఆరోగ్య సూత్రాలను ప్రతిపాదించి వారు బడిలో ఉత్సాహాన్ని పెంచుకునేందుకు తోడ్పడేలా చేశారు. చిన్నారులు భోజనం చేస్తున్న బొమ్మలతో ముఖచిత్రం కనువిందు చేసింది. చివరిపేజీ లోపలివైపు ఓ ఐడియా...'రీడింగ్ రాక్, అక్వేరియం బెడ్‌రూం, మెట్లు పక్క జారుడు బల్ల...' అమితాశ్చర్యం కలిగిస్తున్నాయి. "ఆహ్లాదం ఆగ్రా ప్రయాణం" కనులకింపుగా వుంది. సొట్టబుగ్గల సోయగం" వివరణ బావుంది.

టి.వి.డి.ఎన్.ఎస్.రావు,
విజయవాడ.

పులులపై చక్కటి వివరాలు

ఈవారం ప్రతి ఒక్క అంశం దేనికదే ప్రాధాన్యతను సంతరించుకుంది. ముఖ్యంగా కవిత్వంలో 'అలా వెళ్లిపోతావ్' అనే కవితలో రచయిత తన భావాల్ని జీవిత యాత్రాంశంలో సునిశితంగా చొప్పించి మెప్పించారు. అలాగే 'టెన్షన్... టెన్షన్'లోని భావాల్ని రచయిత నేటి జీవనయానంలో అంతా టెన్షన్ అంటూ చెప్పారు. సినిమా కబుర్లులో తెలుగు అనువాద చిత్రాలకు అరవై ఏళ్ల శీర్షిక చాలా బావుంది. చూద్దామాలో అందాల సిడ్నీ అందాలు స్టాన్లీ బీచ్, హార్బర్ బ్రిడ్జి వెస్ట్‌ఫీల్డ్ మార్కెట్ బౌద్ధాలయంలో.. బుద్ధుడు, విక్టోరియా బిల్డింగ్ చాలా నచ్చాయి. కవర్‌స్టోరీ నల్లమల పులుల సామ్రాజ్యంలో వివరాలు బావున్నాయి. ప్రభుత్వం విధుల గురించి చక్కగా చెప్పారు.

సీతారామారావు, విజయవాడ.

హుందాగా హాస్యం

మనలో మాట "తివిరి ఇసుమున" నేటి సమసమాజ తీరుతెన్నులకు తిలోదకాలిచ్చిన పెట్టుబడిదారీ ప్రజాప్రతినిధుల కుహనా ఆదర్శవాద సిద్ధాంతాలకు ఒక మచ్చుతునక మాత్రమే. నిర్భయంగా, నిస్సిగ్గుగా, నిస్సంకోచంగా ప్రజలను, ప్రజల ఆస్తులను దోపిడి చేస్తున్న అధికారిక నియంతృత్వ పోకడలకు అది ఒక నిలువెత్తు సాక్ష్యం. సెల్‌ఫోన్ క్రమంగా హెల్‌ఫోన్‌గా మారుతున్న వైనాన్ని జాగ్రత్తలను ఈపేజ్‌లో చక్కగా వివరించారు. నవ్వుల్- పువ్వుల్‌లో హాస్యం హుందాగా, ఆరోగ్యకరంగా ఉంటోంది. సరియైన సమయంలో స్కూల్‌కెళ్లే పిల్లలకు ఆహారం విషయంలో పాటించాల్సిన అత్యంతావశ్యకమైన, అతి ముఖ్యమైన పరిజ్ఞానాన్ని అట్టమీది కథలో డా॥ సుజాతా స్టీఫెన్‌గారు అందించారు. ఈ విషయంలో మధ్య తరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాలు, తక్కువ ఆర్థిక స్థోమత గల కుటుంబాలు, తక్కువ ఖర్చుతో పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించే మెళకువలను ఇంకాస్త వివరంగా అందిస్తే మరింత బాగుండేది. మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లు కష్టాల్లో ఉన్న శ్రామిక కుటుంబాలకే ఒకటెనుక మరొకటి వరుసబెట్టి వచ్చే కష్టాలను "జీవఫలం చేదువిషం"లో రచయిత చక్కగా చిత్రీకరించారు. ఆతృతలో తీసుకొనే అసమగ్ర నిర్ణయాలు ఎంత ప్రమాదానికి దారితీస్తాయో క్లైమాక్సులో చూపించారు. ఈ వారం 'వికాసం', 'బాల నేస్తాలు' కూడా చాలా బాగున్నాయి.



బైరి సత్యనారాయణ,
ఖమ్మం.

నిబద్ధతకు నిదర్శనం

పేరెన్నికగన్న భారతీయ ప్రముఖ చిత్రకారుడు ఎంఎఫ్ హుస్సేన్ గురించిన అనేక విషయాలను సునీత్‌చోప్రా వ్యాసం ద్వారా తెలియచేసినందుకు అభినందనలు. ప్రజాకళాకారుడు షఫ్దర్ హష్మీకి నివాళు లర్పిస్తూ గీసిన బొమ్మ ప్రజాపోరాటాలపట్ల ఆయనకు గల నిబద్ధతకు నిదర్శనం. స్పెయిన్‌లోని ఫ్రాంకోలీలో ప్రవాసంలో వుండగా మరణించిన కమ్యూనిస్ట్ పార్టీ సభ్యుడు పికాసో చిత్రాలు హుస్సేన్‌కు ఎంతో స్ఫూర్తినిచ్చాయి. హిందూ మతోన్మాద శక్తుల దాడుల నుండి భారత ప్రభుత్వం హుస్సేన్‌కు రక్షణ కల్పించలేకపోయింది. కనుక ఆయన దేశం విడిచి వెళ్లిపోయారు. మాతృ దేశంలో మరణించాలన్న ఆయన కోరిక నెరవేరలేదు.

టి. శ్రీరామమూర్తి, గాజువాక, విశాఖ.









కుటుంబసభ్యులతో జన్రీ

పొట్టి మనిషి

జన్రీ... గిన్నిస్ బుక్ ఎక్కాడు తెల్సుగా!
వుండేది ఫిలిప్పైన్స్‌లోని ఓ మారుమూల గ్రామంలో.
అయితేనేం... దేశ దేశాలనుంచి వస్తున్నారు అతన్ని చూడ్డానికి. ఏంటో అతగాడి స్పెషల్?
వయసు రీత్యా చూస్తే పద్దెనిమిదేళ్లు. సైజు చూస్తే ఏడాది పిల్లవాడంత.
అందుకే గిన్నిస్ బుక్ ఎక్కగలిగాడు.
ఈ మధ్యే ప్రపంచంలోకెల్లా పొట్టిమనిషి పట్టా పొందిన జన్రీ గురించి .....

'జన్రీ'ని చూస్తే ఏడాది లోపు పిల్లాడిలా కనిపిస్తాడు. చాలా బలహీనంగా వుంటాడు. కానీ జూన్ 18న సరిగ్గా పద్దెనిమిదవ సంవత్సరంలోకి అడుగెట్టాడు. కానీ పొడవు మాత్రం 22 అంగుళాలు మాత్రమే. అతని శాపమే వరమైంది. అంత చిన్న రూపంతో వున్న జన్రీని చూసి ఇన్నాళ్లూ ఎంతగానో బాధపడ్డారు కుటుంబీకులంతా. ఇప్పుడు మాత్రం కాసేపు ఆ బాధను మర్చిపోయి సంతోషంగా నవ్వగలుగుతున్నారు. అంతా గిన్నిస్ బుక్ వారి పుణ్యమే!

జన్రీకి అమ్మానాన్న ముగ్గురు తోబుట్టువులు వున్నారు. అంతా వయసుకు తగ్గ పొడవు, బరువుతో ఆరోగ్యంగా వున్నారు. ఎంచక్కా స్కూళ్లకు కూడా వెళుతున్నారు. కానీ జన్రీ మాత్రం వెళ్లలేడు. అసలు అందాకా ఎందుకు? కనీసం సొంతంగా నడవను కూడా నడవలేడు. ఎప్పుడూ ఎవరో ఒకరి సాయం వుండాల్సిందే. కాసేపు కూడా నిలబడలేడు. అందుకే ఎక్కువగా అమ్మే వెంట వుంటుంది. నాన్న దేశ రాజధాని మనీలాకు 570 మీటర్ల దూరంలో వున్న పట్టణంలో కమ్మరి పనిచేస్తాడు. రోజూ సొంత ఊరి నుంచి పట్టణానికి రావడం పోవడం యాతనతో కూడుకున్న వ్యవహారమనిపించింది. అందుకే వారానికి ఐదురోజుల పాటు పట్టణంలోనే వుంటాడు. రెండు రోజులు మాత్రం భార్యాపిల్లలతో గ్రామంలో వుంటాడు. దాంతో తల్లి మరో పనిలోకి వెళ్లకుండా పెద్ద కుమారుడైన జన్రీని కనిపెట్టుకుని ఇంట్లోనే వుంటుంది.

వాస్తవానికి జన్రీ పుట్టిన ఏడాదికి సమస్య ఏంటో మెల్లమెల్లగా ఇంట్లో వారికి తెలిసింది. అతని పెరుగుదలలో తేడాను వారు పసిగట్టారు. వెంటనే స్థానిక వైద్యుడికి చూయించారు కూడా. కాకపోతే వారికి సమస్య ఏంటనేది అంతుబట్టలేదు. తెల్లమొహం వేశారు. తర్వాత తిరిగి పన్నెండేళ్ల వయసులో జన్రీని మళ్లీ డాక్టర్‌కు చూయించారు. ఎందువల్ల పెరుగుదల ఆగిపోయిందో చెప్పలేదు గానీ విటమిన్లు బాగా వున్న ఆహారం, మందులు వాడమని మాత్రం చెప్పారు. తమ ఆదాయం అంతంత మాత్రం కావడంతో అదీ కుదరలేదు వారికి. అలాగే రోజులు నెట్టుకొచ్చారు.

ఈ ఏడాది జూన్ 18వ తేదీ నాటికి సరిగ్గా పద్దెనిమిదవ సంవత్సరంలోకి అడుగెట్టాడు. అంతే గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లోకి ఎక్కేశాడు జన్రీ. ప్రపంచంలోకెల్లా అతి పొట్టి మనిషిగా అవార్డు కొట్టేశాడు. ఇప్పటి వరకు ఆ టైటిల్ నేపాల్‌కు చెందిన ఖగేంద్ర ధాప మగర్ అధీనంలో వుండేది. ఇప్పుడు జన్రీ దాన్ని సొంతం చేసుకున్నాడు. ఎందుకంటే ఖగేంద్ర ఎత్తు 26.4 అంగుళాలు. అంటే ఇప్పుడు ఇతనే ప్రపంచంలోకెల్లా రెండవ పొట్టివాడన్నమాట.

గిన్నిస్ బుక్ వారు జన్రీ ఇంటికి వచ్చి అతని ఎత్తు, బరువు, పుట్టిన తేదీ వివరాలన్నీ సరిచూసుకుని ఓకే చేశారు. ఒక రోజున స్థానిక మేయర్ జన్రీ కుటుంబీకులకు పార్టీ కూడా ఇచ్చారు. పైగా జన్రీని చూడ్డానికి అమెరికా, బ్రిటన్ వంటి పెద్ద పెద్ద దేశాల నుంచి కూడా సందర్శకులు రావడం గొప్పగా వుంది కుటుంబీకులకు. నిరుపేద కుటుంబానికి చెందిన జన్రీ ఇప్పుడు ఇంతకు ముందెన్నడూ లేనంత సంతోషంగా వున్నాడు. జీవితంలో మొదటిసారిగా బీర్ రుచి చూశాడు. తనకు కూడా అందరిలాగే అందమైన భార్య వుంటే బావుండంటాడు. పైగా ఆవిడ ఖచ్చితంగా తనకంటే ఎత్తు వుంటుందని కూడా అంటున్నాడు ఆశగా...!

★

ప్రతి రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి! అప్పడే శరీరం మన చెప్పచేతల్లో వుంటుంది. లేకపోతే అద్దంలో పట్టం. ఇహ చెప్పేదేముంది! ఆ తర్వాత అన్నీ ఆటంకాలే. ఆరోగ్య సమస్యలే. కానీ వ్యాయామాన్ని బద్ధకించేవారు సాధారణంగా 7 సాకులు చెప్తుంటారు. అవేంటో...వాటిని వదిలించుకోవాల్సిన ఆవశ్యకత ఏంటో చెప్పకుందాం....

వ్యాయామం ఎందుకు?!

1. రోజూ చేయాలంటే టైమ్ ఎక్కడిదీ...



చాలా మంది సర్వసాధారణంగా చెప్పే సాకు ఇది. నిజానికి ప్రతి ఒక్కరికీ వుండేది 24 గంటలే. కాకపోతే అందులో ప్రాధమ్యాలను పెట్టుకోవాల్సింది మనమే. రోజుకు ఓ అర్ధగంట సమయాన్ని వ్యాయామానికి వెచ్చించలేమా! అయినా ఆరోగ్యం కన్నా దేనికి ప్రాధాన్యత ఇవ్వాలి? టీవీ చూస్తాం. సినిమాలకెళ్తాం. పని చేస్తాం. కానీ వ్యాయామం అనేసరికి ఎక్కడ లేని వంకలు చెప్పేస్తాం. ఏదైనా మన సంకల్పాన్ని బట్టే వుంటుంది.

2. అయినా ఎందుకు ఉపయోగపడుతుంది?



వ్యాయామం నుంచి తప్పించుకోవడానికి చెప్పే రెండవ సాకు ఇది. మనసులో మాత్రం సన్నగా కావాలనే కోరిక వుంటుంది. ఎలా సాధ్యం చెప్పండి? ఏళ్ల తరబడి తిని కూర్చుని ఒక్కసారిగా శరీరం నాజూగ్గా అవ్వాలంటే అవ్వదు కదా. అదీ వ్యాయామం చేయకుండా. ఎంత జిమ్ములకెళ్లినా ఒక్కసారిగా సైజు తగ్గలేం కదా. క్రమం తప్పని వ్యాయామం మన ఆకృతిని రూపుదిద్దుకోవడానికే కాదు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికీ పనికొస్తుంది. గుండెపోటు, పక్షవాతం, డయాబెటిస్ వచ్చే అవకాశాలు చాలా వరకు తగ్గుతాయి.

3. మరీ బోర్...

వ్యాయామం అంటే గంటల కొద్దీ యంత్రాల దగ్గర గడపడం కాదు. ఏదైనా మనకు నచ్చింది చేస్తే చాలు. మనకు ఏదైతే బాగున్నట్టనిపిస్తే దాన్నే క్రమం తప్పకుండా చేస్తే సరి. పైగా వ్యాయామం అంటే ఫలానా మాదిరిగానే చేయాలనే రూలేం లేదు. టెన్నిస్, గోల్ఫ్, డాన్స్, యోగా...ఏదైనా సరే ఉత్సాహాన్నిచ్చేదాన్ని ఎంచుకుంటే సరి.

4. అంత ఓపికేది!

అయినా వ్యాయామం చేసేంత ఓపిక ఎక్కడుందీ! అనుకుంటాం. కాని వ్యాయామాల్లో నడక అత్యుత్తమమైంది. దీనికి ప్రత్యేకమైన ప్రదేశం అవసరం లేదు. ఎక్కడైనా చేయొచ్చు. ఎలాంటి బట్టలైనా వేసుకోవచ్చు. అయితే సౌకర్యంగా మాత్రం వుండేలా చూసుకోవాలి. అలాగే నడకకు వీలైన పాదరక్షలు వేసుకోవాలి.

వయసైపోయింది కదా..

నడవడానికి వయసు ఆటంకమే కాదు. నడక వంటి మిత వ్యాయామం వల్ల అన్ని వయసుల వారూ పెద్ద పెద్ద జబ్బులు రాకుండా నివారించవచ్చని వైద్య అధ్యయనాలు చెప్తున్నాయి. నడక అలవాటున్నవారు ఎక్కువకాలం జీవిస్తారని కూడా అంటారు. క్రమం తప్పకుండా నడవడం వల్ల శరీరం వారి స్వాధీనంలో వుంటుంది. వార్ధక్యంలో కూడా మనసు ఉల్లాసంగా ఆహ్లాదంగా వుంటుంది.

6. దాని బాధ పడలేం

ఏదైనా వ్యాయామం మనకి బాధ కలిగిస్తే దాన్ని వదిలేయడం మంచిది. శరీరానికి అనువైన వ్యాయామాన్నే ఎంచుకోవాలి. మితిమీరి వ్యాయామం చేస్తే అది మనల్ని గాయపరచవచ్చు. నెమ్మదిగా మృదువుగా మాత్రమే శరీర సౌష్టవాన్ని తీర్చిదిద్దుకోవాలి

7. అలసిపోయా!

నిజానికి వ్యాయామం శరీరానికి కొత్త శక్తిని ఇస్తుంది. కొత్త ఉత్సాహాన్ని ఇస్తుంది. క్రమంగా చైతన్యాన్ని పెంచుతుంది. కొత్త ఉత్తేజాన్నిస్తుంది. అదే విధంగా క్రమంగా వ్యాయామం చేయడం వల్ల సాధారణ శక్తి స్థాయి కూడా పెరుగుతుంది.



టెక్ పేజ్

మొజిల్లా ఫైర్‌ఫాక్స్-4 విడుదల చేసి మూడు నెలలు కాకముందే తన కొత్త బ్రౌజర్ వర్షన్ 'మొజిల్లా ఫైర్‌ఫాక్స్-5' మార్కెట్లోకి విడుదలైంది. మొజిల్లా ఫైర్‌ఫాక్స్-5 వెబ్‌బ్రౌజర్ ముఖ్యంగా డెస్క్ టాప్, ఆండ్రాయిడ్ డివైజెస్ కోసం ప్రత్యేకంగా రూపొందించడం జరిగింది. అంతేకాకుండా మొజిల్లా ఫైర్‌ఫాక్స్-5లో ఎన్నో ఎన్నెన్నో కొత్త ఫీచర్లు అందుబాటులోకి వచ్చాయి. వెబ్ బ్రౌజర్ మార్కెట్‌లో మొజిల్లా ఫైర్‌ఫాక్స్-5 ఓ చరిత్ర సృష్టించనుందని మొజిల్లా ప్రతినిధులు తెలియజేస్తున్నారు.

సరికొత్త ఫీచర్లతో ఫైర్‌ఫాక్స్ 5

మొజిల్లా ఫైర్‌ఫాక్స్-5లో కొత్త ఫీచర్లు, సెక్యూరిటీ అప్‌డేట్లు, స్టెబిలిటీ ఇంప్రూవ్‌మెంట్లు లాంటి సరికొత్తవి అందుబాటులోకి వచ్చాయి. అసలు మీరు గూగుల్ క్రోమ్-12, ఇంటర్నెట్ ఎక్స్‌ప్లోరర్-9ని కాదని మొజిల్లా ఫైర్‌ఫాక్స్-5ని సెలక్ట్ చేసుకోవడానికి గల కారణాలను కూడా వివరించారు. కొత్తగా విడుదల చేసినటువంటి మొజిల్లా ఫైర్‌ఫాక్స్-5లో 1000కి పైగా ఇంప్రూవ్‌మెంట్స్ ఉండడంతో బ్రౌజర్‌ని సులభంగా ఉపయోగించుకోవడానికి వీలుంటుంది. మొజిల్లా ఫైర్‌ఫాక్స్5 మోడ్రన్ వెబ్ టెక్నాలజీని కూడా సపోర్టు చేస్తుంది. దీనివల్ల డెవలపర్లకి ఫైర్‌ఫాక్స్ యాడ్ ఆన్స్, వెబ్ అప్లికేషన్స్, వెబ్‌సైట్స్ రూపొందించడం చాలా ఈజీగా ఉంటుంది. మొజిల్లా ఫైర్‌ఫాక్స్-5లో కొత్తగా ప్రవేశపెట్టిన ఫీచర్ "డు నాట్ ట్రాక్" ప్రైవసీ ఫీచర్. దీనివల్ల యూజర్లకి వెబ్‌లో బ్రౌజింగ్ చేసేటప్పుడు మంచి కంట్రోలింగ్ ఉంటుంది. ఈ ఫీచర్ ఫైర్‌ఫాక్స్ ప్రిఫరెన్సెస్‌లో ఉంటుంది.

మరో ఆరు వారాల తర్వాత అంటే- ఆగస్టులో ఫైర్‌ఫాక్స్-6, ఆ తర్వాత 6 నుండి 8 వారాలకు ఫైర్‌ఫాక్స్-7 విడుదలకు రంగం సిద్ధమైంది. అంతేకాకుండా ఈ ఏడాది క్రిస్మస్ నాటికి మరిన్ని ఆకర్షణీయమైన ఫీచర్లతో ఫైర్‌ఫాక్స్-8 కూడా విడుదల చేయనున్నట్లు మొజిల్లా సంస్థ చెపుతోంది. ఫైర్‌ఫాక్స్ బ్రౌజర్ ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా 70 భాషల్లో లభిస్తుండగా, మరో 14 భాషల్లో కూడా అందించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఇప్పటికే ఫైర్‌ఫాక్స్-4 వెర్షన్‌లో అనేక సౌలభ్యాలు అందుబాటులో వున్నాయి. వెబ్ బ్రౌజర్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకుంటే లభ్యమయ్యే ఎన్నో ఫీచర్లతో పాటు పని సులువవుతుంది. అడ్రస్‌బార్ చివర్లో రీలోడ్, స్టాప్ ఏర్పాటు చేశారు. టూల్‌బార్‌లో చివర్లో ఇల్లు గుర్తు ద్వారా హోంపేజీలోకి వెళ్లొచ్చు. ఎప్పుడూ ఓపెన్ చేసి వుంచాల్సిన సర్వీసులను ఐకాన్ గుర్తులా పెట్టుకోవాలంటే ట్యాబ్‌పై రైట్‌క్లిక్ చేసి 'పిన్ యాజ్ యాప్ టాబ్' (Pin as App Tab)పై క్లిక్ చేయవచ్చు. అనుకోకుండా తొలగించిన ట్యాబ్‌ను పొందాలంటే ట్యాబ్‌పై రైట్ క్లిక్ చేసి 'అన్‌డూ క్లోజ్ ట్యాబ్' ఎంచుకోండి. ఉన్న ట్యాబ్‌ను కాకుండా మిగతా అన్నింటిని క్లోజ్ చేయాలంటే 'క్లోజ్ అదర్ ట్యాబ్స్'ను సెలెక్ట్ చేయండి.

ఓపెన్ చేసిన అన్ని ట్యాబ్‌లను థంబ్ నెయిల్ బాక్సుల్లో చూడాలంటే 'ట్యాబ్ గ్రూప్స్'తో సులభం. 'ఫైర్‌ఫాక్స్ సింక్' ద్వారా బుక్‌మార్క్‌లు, పాస్‌వర్డ్‌లు, హిస్టరీలను ఇతర డివైజ్‌ల్లోకి సింక్రనైజ్ చేసుకోవచ్చు. సైట్ సెక్యూరిటీని చూడాలంటే అడ్రస్‌బార్ పక్కనే కనిపించే సైట్ గుర్తుపై క్లిక్ చేయాలి. తాళం గుర్తుతో సెక్యూరిటీ వివరాల్ని చూపిస్తుంది. 'మోర్ ఇన్ఫర్మేషన్'పై క్లిక్ చేసి సర్టిఫికెట్, కుకీస్ వివరాల్ని చూడొచ్చు. 'వ్యూ సేవ్డ్ పాస్‌వర్డ్'తో సేవ్ చేసిన పాస్‌వర్డ్ వివరాల్ని చూడొచ్చు. యాడ్ ఆన్స్ కోసం ప్రత్యేకంగా 'యాడ్-ఆన్స్ మేనేజర్'ను ఏర్పాటు చేశారు.

అదేవిధంగా మనకు అవసరమైన పేజీని స్క్రీన్‌షాట్ తీసుకోవాలంటే టూల్స్ ఇన్‌స్టాల్ చేసుకోవక్కర్లేదు. ఆసమ్ స్క్రీన్‌షాట్ -కాప్చర్ అండ్ అన్నొటేట్ (Awesome Screenshot- Capture and Annotate) యాడ్‌ఆన్‌ను బ్రౌజర్‌లో ఇన్‌స్టాల్ చేసుకుంటే సరి. 'కాప్చర్ విజిబుల్ పార్ట్'తో తెరపై కనిపించే వాటిని ఇమేజ్‌లా మార్చొచ్చు. పేజీ మొత్తాన్ని మార్చాలంటే 'కాప్చర్ ఫుల్‌పేజీ' సెలెక్ట్ చేసుకోవాలి. అదే మెనూలోని 'ఆప్షన్స్'తో ఇమేజ్ ఫార్మెట్‌ను (పిఎన్‌జి, జెపిజి) మార్చుకునే వీలుంది. స్క్రీన్‌షాట్ తీయగానే ప్రత్యేక ట్యాబ్ విండోలో ఇమేజ్ కనిపిస్తుంది. 'డన్'పై క్లిక్‌చేసి 'సేవ్ లోకల్'తో సేవ్ చేసుకోవచ్చు. డిగో (diigo) ఆన్‌లైన్ సర్వీసులో భద్రం చేసుకుని సోషల్ నెట్‌వర్క్‌లో పంచుకునే వీలుంది.

కొత్త ట్యాబ్‌ను పొందాలన్నా, ఉన్న ట్యాబ్‌ను తొలగించాలన్నా, పేజీలను జూమ్ చేయాలన్నా 'మౌస్ కంట్రోల్'తో సాధ్యమవుతుంది. పేజీపై కుడి బటన్‌తో డబుల్ క్లిక్ చేస్తే కొత్త ట్యాబ్ వచ్చేస్తుంది. కుడి బటన్‌ను నొక్కి ఉంచి మధ్యలోని స్క్రోలర్‌ను తిప్పితే ఓపెన్ చేసి ఉన్న అన్ని ట్యాబ్‌లను వరుసా యాక్సెస్ చేయవచ్చు. కుడి బటన్‌ను నొక్కి ఉంచి ఎడమ బటన్‌ను నొక్కితే ఇంతకు ముందు ఉన్న (లాస్ట్ యూజ్డ్ ట్యాబ్స్)లోకి వెళ్లొచ్చు. ఎడమ బటన్‌ను నొక్కి ఉంచి స్క్రోలర్‌ను తిప్పితే పేజీ జూమ్‌ఇన్, జూమ్‌అవుట్ అవుతుంది. 'ఎక్స్‌టెన్షన్స్' విభాగంలోకి వెళ్లి ఆప్షన్స్‌తో మరిన్ని మార్పులు చేసే వీలుంది.

టాస్క్‌బార్ పైభాగంలో కనిపించే స్టేటస్‌బార్ కొత్తవెర్షన్‌లో కూడా ఉండాలనుకుంటే 'డౌన్‌లోడ్ స్టాటస్‌బార్' ఇన్‌స్టాల్ చేసుకోండి. డౌన్‌లోడ్స్‌ని సులభంగా మేనేజ్ చేసుకోవచ్చు. సాఫ్ట్‌వేర్, పాటలు ఇలా ఏదైనా డౌన్‌లోడ్ పెట్టాక స్టేటస్‌బార్‌లో వేగం, సమయం కనిపిస్తాయి. డౌన్‌లోడ్ పూర్తవ్వగానే ఫైల్ పేరు, ఐకాన్ కనిపిస్తుంది. పాయింటర్‌ను దానిపై ఉంచగానే పేరు, డౌన్‌లోడ్ చేసిన సైట్ అడ్రస్, సేవ్ చేసిన లొకేషన్, సైజు, డౌన్‌లోడ్ చేయడానికి పట్టిన సమయం, స్పీడ్ కనిపిస్తాయి. రైట్ క్లిక్ చేసి 'రీనేమ్, కాపీ సోర్స్ యుఆర్‌ఎల్, విజిట్ సోర్స్ వెబ్‌సైట్' ఆప్షన్లను ఉపయోగించుకోవచ్చు.

కివిక్లిక్ (KwiClick) ను బ్రౌజర్‌లో నిక్షిప్తం చేసుకుంటే గూగుల్ సెర్చ్ వెతుకులాట మరింత సులువవుతుంది. Kwi గుర్తుపై క్లిక్ చేసి, బ్రౌజర్ కిందిభాగంలో కుడివైపు వచ్చే బాక్స్‌లో సెర్చ్ చేసుకోవచ్చు. యూట్యూబ్, వికిపీడియా, ట్విట్టర్, ఫేస్‌బుక్, ఫ్లిక్కర్... సర్వీసుల్ని ఐకాన్ల రూపంలో బాక్స్‌లో పొందొచ్చు. ఫైర్‌ఫాక్స్ 4, 5 వెర్షన్లలోనే ఇన్ని అద్భుతమైన ఫీచర్లుంటే... ఇకముందు రాబోతున్న 6, 7, 8 వెర్షన్లలో ఇంకెన్ని ఫీచర్లుంటాయో తెల్గిగానే ఊహించవచ్చు. మరెందుకాలస్యం ఈ సరికొత్త బ్రౌజర్లలోని ఆప్షన్లను ఉపయోగించుకొని ఆన్‌లైన్ విహారాన్ని మరింత సులభం చేసుకోండిక.

★

కవిత్వమ్

మాట్లాడే మౌనం



ఖడ్గాలు పుష్పిస్తున్నాయి
అంతరంగ విధ్వంసాన్ని
దనుమాడటానికి
మిద్యా గౌరవాల చాటున
దాక్కున్న అసహ్యాల్ని
సల్ఫ్యూరిక్ సముద్రంలో కలిపే రోజు
సూర్యుడు నిప్పులు విరజిమ్ముకుంటూ
కనుదోయిలోనే ప్రత్యక్షమవుతాడు
సంసారంలో ధర్మాలూ, అధర్మాలూ
పడికట్టు రాళ్లయిన వేళ
పసుపు పూసిన పాదాలు
లోగిలిలోకి హుందాగా విలువలతోనే అడుగిడాయి
ఇరుగు పొరుగు ఉన్మాదాలు
విచ్చుకత్తులై
క్రానిక్‌గా వెంటాడుతూ
మనిషి మూలాల్ని తుత్తునియలు
చేస్తున్నా
అట్టడుగు స్థాయిలో
మీరే మా చిట్టచివరి గురి
అనే రీతిలో
కనపడని నిరంకుశత్వాన్ని
మస్తిష్కంలో ప్రతి నిత్యం పారాయణం
చేయిస్తున్నారు
వర్తమానపు కన్నులకు కప్పిన పొరల
మాటున
వేటాడే మానవ మృగాల
బారిన పడ్డ నాగరికత
చెదలు పట్టింది
చరిత్ర ఎవరు వక్రీకరించబోయినా
చైతన్యం శిఖరాగ్రమై
వెలుగుతుంది
కొత్త పూలు పూయని నేల
ధర్మాగ్రహం వెలిబుచ్చలేని
నిదుర పోతున్న అగ్ని పర్వతం
ఆరిపోయింది కదాని
ఎవ్వరూ ఆవాసం ఉండే సాహసం
చెయ్యరు కదా!
మండుతున్న అగ్ని కీలలు
రగులుతూనే ఉంటే
అంతరంగం ఇంద్రధనస్సులు వెయ్యదు కదా!!
మాట్లాడే మౌనం
ఎక్కుపెట్టిన వాగ్ధాటిని
గురి చూస్తూనే ఉంటుంది.
ఖడ్గ పుష్పాల వైపు

- తమ్మెర రాధిక

కావాలి శాశ్వత తీర్పు

ఎందరి కన్నవారు
కన్నీరు రక్తపు టేరులై
పారుతుందో
ఎందరి తల్లుల కడుపుకోత
ఆర్తనాదాలతో
తల్లడిల్లుతుందో॥

ఉన్న ఊరువిడిచి
ఉన్నత విద్యకు నడిచి
ఉజ్వల భవితకు
ఎదురుచూసి
ఎందరు విద్యాధిక
అభాగ్యులు
అహుతౌతున్నారో॥

కాలేజీల్లో కిరాతకులకు
ప్రేమోన్మాది యాసిడ్ దాడులకు
అరంగేట్రం, రాక్షసక్రీడలకు
బలైన చిట్టి చెల్లెలకు
చట్టం సరిచేయలేక
ఆహుతైన అభాగినుల
ఆత్మశాంతి కైనా
నేరగాళ్లకు
శాశ్వత శిక్ష కావాలి.

-సీరపు మల్లేశ్వరరావు

ధన మూలం మిదం జగత్...

చీమల పుట్టల్లా చెదల్లా
పుట్టకొక్కుల్లా
ఎక్కడపడితే అక్కడ
మొలిచే స్వేదం మొక్కలకీ
అలగా జనాలకీ
గరీబోల్లకీ
వాళ్లకెందుకు భద్రత
వాళ్లకెందుకు చట్టం న్యాయం
పరిరక్షణ వలయం
ఉండీ ఏం
లేకున్నా ఏం
వాళ్ల కష్టమున్నంతదాక
రసం పిండేసుకోవడమేకదా
ఆనక పిప్పయ్యేక
కాల్చెయ్యడమేకద
ఎక్కడ

ఎప్పుడు పడితే అప్పుడు
డబ్బులు మొలుస్తాయో
అక్కడే
భద్రత కావాలి
డబ్బుల వృక్షాలకే
భద్రత కావాలి
భద్రత కమిటీ కూడా వేయాలి
బందోబస్తూ ఉండాలి
భగవంతుడికైనా సరే
ఇందుకు మినహాయింపులేదు
ధన మూలం మిదం జగత్....

- బద్ది నాగేశ్వరరావు



నవ్వుల్ - పువ్వుల్

పిచ్చిగీతలు

(ఒక మోడర్న్ ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో ఓ చిత్రం ముందు పల్లెటూరి ఆసామి కన్నీళ్లు తుడుచుకుంటున్నాడు.)

చిత్రకారుడు: ఈ బొమ్మ మీకు బాగా నచ్చిందాండీ.

ఆసామి: ఈ బొమ్మలు చూస్తుంటే చనిపోయిన మా చిన్నబ్బాయి గుర్తొస్తున్నాడు. వాడు కూడా గోడలమీద ఇలాగే పిచ్చి గీతలు గీసేవాడు

నేమాన సుభాష్, శ్రీకాకుళం.

బహుమతులు

టీచర్ : గోపీ! మీఇంటికి వచ్చే చుట్టాలు మీకేమైనా బహుమతులు తెస్తారా?

గోపీ : ఈ మధ్య మా నాన్నకు దగ్గు, మా అమ్మకు తలపోటు, నాకేమో చర్మవ్యాధులు బహుమతులుగా ఇచ్చారు టీచర్!

వెరైటీ సినిమా

విలేకరి : మీరు తీస్తున్న కొత్త సినిమా ప్రత్యేకతలు ఏంటి?

నిర్మాత : విలన్ తెలుగు వాడు. ఆంధ్రభాషలో అక్షరాలు, పదాలతో జిమ్మిక్కులు చేసే రచయితతో పాటలు, మాటలు రాయిస్తున్నాం.

రుణం



కష్టమర్ : మంచినీళ్ల గ్లాసు అడుగున బొద్దింక ఉంది చూడు.

సప్లయర్ : అంతా రుణానుబంధం సార్! ఆ బొద్దింకకు మీరు ఏ విషయంలోనో రుణపడి ఉంటారు.

ఒప్పందం

ఫణి : నా ఆశుకవిత్వం వింటావా?

గోపాల్ : అది వింటే నా కడుపేమైనా నిండుతుందా!

ఫణి : నీ కడుపు నేను నింపుతాను. నా వెయ్యి పేజీల కవిత్వం వింటే భోజనం పెట్టిస్తాను.

- జె. సుధాకర్ పట్నాయక్, కాకినాడ.

ముందు జాగ్రత్త

సినీ విలేకరి: (నిర్మాతతో...) మీరు నటీనటుల విషయంలో ఏవో ప్రత్యేకమైన జాగ్రత్తలు తీసుకుంటారట కదా. అవేంటో చెప్తారా?!

నిర్మాత: ఆ...ఏముందండీ...సీరియల్ అంటే కనీసం ఐదారేళ్లు తీస్తాం కదా. నటీనటులు మధ్యలోనే హరీమంటే కొంప మునుగుతుందికదా. అందుకని ఎంపిక సమయంలోనే వారి ఆరోగ్యం గురించిన పూర్తి వివరాలు తెలుసుకుంటుంటాను.

ఒ. రామకృష్ణ, విజయవాడ.

కాపీ

టీచర్: రామ్! కుక్క గురించి నువ్వు రాసిన వ్యాసం... మీ అన్నయ్య రాసిన వ్యాసం ఒకటిగా వుంది. నువ్వు దాంట్లోంచి కాపీ కొట్టావా?

రామ్: లేదు టీచర్. ఇద్దరం ఒకే కుక్క గురించి రాశాం.

ఖచ్చితంగా

1వ సందర్శకుడు: ఈ పెయింటింగ్ సరిగ్గా 500 సంవత్సరాల 20 రోజుల కిందట వేసినది తెల్సా!

2వ సందర్శకుడు: అవునా! నీకు అంత ఖచ్చితంగా ఎలా తెల్సు.

1వ సందర్శకుడు: అది 500 ఏళ్లనాటిదని గైడ్ చెప్పాడు. ఇక్కడ 20 రోజులుగా వుంది కాబట్టి 500 సంవత్సరాల 20 రోజుల కిందట గీసినదని చెప్పాను.

ప్రత్యేకత

టీచర్: బుద్ధుడు, జీసస్, మహావీర్, గురునానక్... మధ్య కామన్‌గా వున్న అంశం ఏంటి?

విద్యార్థి: అందరూ మన జాతీయ సెలవు దినాల్లోనే పుట్టారు సార్.

బాధ



విలేకరి: సార్! మీరు ఇంత ప్రముఖ వాద్యకారుడు కదా. కానీ పియానో వాయించేప్పుడు కళ్లు మూసుకుంటారెందుకు సార్?

వాద్యకారుడు: ప్రేక్షకుల బాధ చూడలేక.

ఇంజెమూముల్ షరీఫ్, హైదరాబాద్.

జోక్స్ బాగా వేస్తారా? మరైతే అలస్యం ఎందుకు! కార్డు మీద రాసి పంపండి. పాఠకులను కడుపుబ్బ నవ్వించండి. మా చిరునామా:
స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ప్లాట్‌నెం.21/1, అజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాద్

పురుషాధిక్య సినిమా రంగం మహిళలు

సినిమా కబుర్లు

తెలుగు సినీ రంగంలో మహిళలకున్న పాత్ర ఏమిటి? వాళ్ళ స్థితిగతులు, పని పరిస్థితులు ఎలా ఉన్నాయి? ఇది చాలా గంభీరమైన ప్రశ్న. నిశితమైన పరిశీలన, లోతైన చర్చ జరగాల్సిన విస్తృతమైన అంశం. మాటలు లేని తెర మీది బొమ్మల రోజుల సంగతి పక్కనబెట్టినా, వెండితెర మాటలు నేర్చి ఈ ఏడాదితో 80 ఏళ్ళు నిండిపోయాయి. చిత్రం ఏమిటంటే - ఇన్నేళ్ళు గడిచినప్పటికీ భాషాభేదాలు లేకుండా, పురుషాధిక్య సినీ రంగంలో స్త్రీల స్థితిగతులు మాత్రం దాదాపు ఒకే విధంగా ఉన్నాయి. సినీ సీమలో మగవారిదే పై చేయి కాగా, మహిళలు మామూలు తేలికపాటి పనుల్లోనే మిగిలిపోయారు.



'ఆకాశంలో సగం'గా చెప్పుకొనే అతివలకు అక్కడ అవకాశాలు అంతంత మాత్రమే. సినిమా అనే తమ ఉత్పత్తికి మంచి బ్రాండ్ అంబాసడర్ అంటే అందమైన నటీమణులనే దర్శక, నిర్మాతల నమ్మకం. అందుకే, వారి వాణిజ్య అవసరాల రీత్యా తెర మీద అందాల ఆరబోత కోసం మాత్రం స్త్రీలకు అవకాశాలిస్తారు. అది మినహా, సినీ రంగంలోని ఇతరేతర శాఖలు వేటిల్లోనూ మహిళల్ని మనం పెద్దగా చూడం. గమనిస్తే -సినీ రంగంలో, ముఖ్యంగా తెలుగులో, ఆడవాళ్ళందరూ హెయిర్ డ్రెస్సర్లు గానో, కాస్ట్యూమర్లు గానో, హీరోయిన్లకు పర్సనల్ అసిస్టెంట్లు గానో కనిపిస్తారు. ఇలాంటి చిన్నా చితకా వ్యవహారాల్లోనే తప్ప, చిత్ర నిర్మాణంలోని కీలకమైన శాఖల్లో వారు కనిపించరు. అథవా కనిపించినా, ఏ నిర్మాతగానో, ఏ దర్శకత్వశాఖలోనో, మహా అయితే ఏ నృత్య విభాగంలోనో కనిపిస్తారు.

చరిత్రలో తొలి ప్రయత్నాలు

ఒక్కసారి చరిత్రలోకి వెళితే, మూకీల రోజుల్లోనే మన దేశంలో మహిళలు నిర్మాణ, దర్శకత్వ బాధ్యతలు చేపట్టిన దృష్టాంతాలు ఉన్నాయి. తొలిసారిగా ఆ ఘనత సాధించిన మహిళ – ఫాత్మా బేగమ్. ఓ ముస్లిమ్ నవాబు భార్య అయిన ఆమె ముందు ఉర్దూ నాటకాల్లో నటించి, ఆపైన మూకీలకు వచ్చారు. దక్షిణ భారతీయ సినీ రంగం వరకు తీసుకున్నప్పటికీ, మహిళా సాంకేతిక నిపుణులు తొలి రోజుల నుంచీ అడపా దడపా మెరుస్తూనే ఉన్నారు. సమాజంలో మహిళల మీద ఆధిపత్యం, అణచివేత ఎక్కువ ఉన్న ఆ కాలంలోనే కొందరు దర్శకులు, సౌండ్ రికార్డిస్టులు వచ్చారు. ఆ రోజుల్లోనే సౌండ్ రికార్డిస్టుగా ఓ మహిళ పనిచేశారంటే ఆశ్చర్యం కలుగుతుంది. తొలి మహిళా సౌండ్ రికార్డిస్ట్ – శ్రీమతి మీనాక్షీ నారాయణన్. దక్షిణాదిలో రూపొందిన తొలి చిత్రమైన 'శ్రీనివాస కల్యాణం' (1934)కు ఆమె సౌండ్ రికార్డిస్ట్. మద్రాసులో రూపొందిన మొట్టమొదటి టాకీ కూడా ఇదే! కర్ణాటక సంగీతంలో నైపుణ్యం ఉన్న ఆమెను స్వయంగా భర్తే శబ్దగ్రహణ శాఖలో ప్రోత్సహించడం విశేషం. ఆ తమిళ టాకీకి ఆమె శబ్దగ్రహణ శాఖను నిర్వహిస్తే, ఆమె భర్త నారాయణన్ దర్శకత్వం వహించారు. దక్షిణ భారతదేశంలో తొలి మహిళా టెక్నీషియన్ ఆమే!

ఇక, తొలి తమిళ టాకీ 'కాళిదాస్' (1931)లో కథానాయిక పాత్ర ధరించిన టి.పి. రాజలక్ష్మి ఆ తరువాత కొద్ది కాలానికే సినీ దర్శకత్వ బాధ్యతలు కూడా నిర్వహించారు. భారత సినీ పరిశ్రమలో టాకీ చిత్రాలకు దర్శకత్వ బాధ్యతలు నిర్వహించిన తొలి మహిళ బహుశా ఆమే! రంగస్థల నటి, మూకీ చిత్రాల్లో కథానాయిక, రచయిత్రి, నిర్మాత, దర్శకురాలు – ఇలా ఆమె బహుముఖీన ప్రతిభావంతురాలు. సాంప్రదాయిక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన టి.పి. (తిరువయ్యార్ పంచపకేశ) రాజలక్ష్మి తరువాతి రోజుల్లో 'రాజమ్ టాకీస్' అనే చిత్ర నిర్మాణ సంస్థను ప్రారంభించి, నిర్మాత అయ్యారు. ఆ తరువాత తానే రచన, నిర్మాణం, దర్శకత్వం చేపట్టి, సంచలనం సృష్టించారు.

నిర్దేశత్వంలో నారీలోకం

తెలుగులో నటి భానుమతి తొలి దర్శకురాలు (తెలుగు, తమిళ, హిందీల్లో 'చండీ రాణి' – 1953). బహుముఖ ప్రజ్ఞావంతురాలైన ఆమె దర్శకత్వం ఆరంభించిన తరువాత ఇరవై ఏళ్ళకు కానీ, మలయాళంలో మహిళా దర్శకులు రాలేదు. మలయాళంలో సినీ దర్శకత్వం వహించిన తొలి వనిత కూడా మన తెలుగమ్మాయే కావడం విశేషం. నటి – దర్శకురాలు విజయ నిర్మలకు ఆ రికార్డు దక్కింది. మలయాళ చిత్రం 'కవిత' (1973)తో ఆమె ఆ ఘనత సాధించారు. ఇక, కన్నడంలో మహిళా దర్శకులు రావడానికి ఆ తరువాత మరో పదేళ్ళు పట్టింది. కన్నడ చిత్రం 'ఫణియమ్మ' (1983)తో ప్రేమా కారంత్ కన్నడ భాషలో తొలి సినీ దర్శకురాలయ్యారు. మెగాఫోన్ పట్టి, మహిళలు చలనచిత్ర దర్శకత్వం వహించే ధోరణి ఆ తరువాత కూడా అడపా దడపా సాగుతూ వచ్చినా, ఇప్పటికీ అది ఓ ప్రత్యేక వార్తగానే మిగిలింది. అంతేతప్ప, సర్వసాధారణ విషయంగా మారలేదు. అందరూ మహిళలే సాంకేతిక నిపుణులుగా కూడా కొన్ని ప్రయత్నాలు జరిగాయి. అలనాటి ప్రసిద్ధ సినీ నటి సావిత్రి 1968లో ఇతర మహిళా ప్రముఖులతో కలిసి శ్రీమాతా పిక్చర్స్‌ను స్థాపించి, స్వీయ దర్శకత్వంలో 'చిన్నారి పాపలు' చిత్రం నిర్మించారు. ఆ తరువాత 'మాతృదేవత' చిత్రానికీ, 'ఉళ్ళమ్', 'ప్రాప్తమ్' లాంటి తమిళ చిత్రాలకూ ఆమె దర్శకత్వం వహించారు. ఆ తరువాత చాలా ఏళ్ళకు అందరూ మహిళలే సాంకేతిక నిపుణులుగా మరో ప్రయత్నం జరిగింది. నటి రేవతి దర్శకత్వంలో, బీనా పాల్ (ఎడిటింగ్), భవతారిణీ ఇళయరాజా (సంగీతం), తామరై (సినీ గీతాలు) తదితర మహిళలే ప్రధాన సాంకేతిక నిపుణులుగా 'మిత్ర్... మై ఫ్రెండ్' (2000) పేరిట ఆంగ్ల చిత్రం రూపొందింది. తమిళ, తెలుగు చిత్రసీమల్లో మహిళా దర్శకుల సంఖ్య ఇప్పుడిప్పుడే కొంత పెరుగుతోంది. దాదాపు 40 పై చిలుకు చిత్రాలకు దర్శకత్వం వహించిన ఏకైక మహిళగా 'గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లోకి ఎక్కిన నటి విజయనిర్మల సహజంగానే తరువాతి తరాలకు ప్రేరణగా నిలిచారు. ఆ స్ఫూర్తితో నటి జీవితా రాజశేఖర్ ('శేషు', వగైరా చిత్రాలు), జర్నలిస్టు – 'సూపర్‌హిట్' సినీ వారపత్రిక అధినేత్రి బి. జయ ('చంటిగాడు' వగైరా) గడచిన దశాబ్దంలో మహిళా దర్శకుల ధోరణిని మరింత ముందుకు తీసుకువెళ్ళారు. నృత్య నిర్దేశకురాలు సుచిత్రా చంద్రబోస్ ఒక చిత్రానికి ('పల్లకిలో పెళ్ళికూతురు') దర్శకత్వం వహించారు. తాజాగా ఈ ఏడాది చిన్న చిత్రాల్లో పెద్ద హిట్‌గా నిలిచిన 'అలా

మొదలైంది...' చిత్ర దర్శకురాలు నందినీ రెడ్డి తన తొలి చిత్రంతోనే అందరి దృష్టినీ ఆకర్షించారు. తమిళంలో 'వేప్పమ్'గా, తెలుగులో 'సెగ'గా త్వరలో రానున్న చిత్రానికి దర్శకురాలైన అంజనా అలీఖాన్ సైతం ఇప్పుడు వార్తల్లో వ్యక్తి అయ్యారు. తమిళనాట కూడా ఇటీవల మహిళా దర్శకుల సంఖ్య బాగానే పెరిగింది. 'కుట్టి' చిత్రంతో జాతీయ అవార్డు సాధించిన జానకీ విశ్వనాథన్, 3 జాతీయ అవార్డులు సాధించిన తమిళ చిత్రం 'శృంగారం' (2005) చిత్ర దర్శకురాలు శారదా రామనాథన్ మొదలు పలువురు ఈ రంగంలోకి వచ్చారు. ప్రధాన స్రవంతి చిత్రాలూ తీస్తున్నారు. హిందీ చిత్రరంగానికొస్తే, దేశవ్యాప్తంగా సంచలనం రేపిన మీరా నాయర్, ఇటీవల నందితా దాస్, ఈ మధ్యే ఫరా ఖాన్ వగైరాలు దర్శకులుగా జనం దృష్టిని ఆకర్షించారు. దక్షిణాదితో పోలిస్తే, హిందీ చిత్ర పరిశ్రమలో వివిధ శాఖల్లో ఎక్కువ సంఖ్యలో మహిళలు కనిపిస్తారు. అయితే, తెలుగునాట "పరికిణీ, పావడాల నుంచి మిడ్డీలు, జీన్స్ ప్యాంట్ వస్త్రధారణ దాకా రోజులు మారిన పరిస్థితుల్లో విద్యావంతులైన యువతులు కొంత ధైర్యంగా సినీ రంగంలోకి వస్తున్నారు. అయితే, సినిమా మీద పిచ్చి ప్రేమతో వస్తున్నారే తప్ప, ఏ పూణే ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ లాంటి చోటో సినీ శాఖలు దేనిలోనైనా నిర్దిష్టమైన చదువు చదువుకొని వస్తున్నవాళ్ళు లేరు" అని పలువురు ప్రముఖ దర్శకుల వద్ద సహాయకుడిగా పనిచేసిన రవికిరణ్ వాదిస్తున్నారు.

ఇతరేతర శాఖల్లో ఇంతేనా అవకాశాలు?

నటన, దర్శకత్వం మినహా ఇతర శాఖలకొస్తే, మహిళలను ప్రధానంగా కథా రచయితలుగానే సినీసీమ గుర్తిస్తూ వచ్చింది. విశేష జనాదరణ పొందిన కథ, నవలా రచయిత్రుల పాపులర్ రచనల్ని వెండితెరకు అనువదించుకోవడానికి పరిశ్రమ ప్రయత్నించింది. అక్కడ కూడా మూలకథను అందించడం వరకే వారిని పరిమితం చేసింది. యద్దనపూడి సులోచనారాణి, కోడూరి కౌసల్యాదేవి, కె.రామలక్ష్మి, ముప్పాళ్ళ రంగనాయకమ్మ, 'కాలాతీత వ్యక్తులు' నవలా రచయిత్రి డా॥పి. శ్రీదేవి, ఇటీవలి కాలంలో బలభద్రపాత్రుని రమణి లాంటి నవలా రచయిత్రులు అలా సాహిత్యం నుంచి సినిమాల మూలకథకులుగా కనిపించినవారే! సినీ సంభాషణల రచన బాధ్యతను వాళ్ళకే పూర్తిగా అప్పగించి, ప్రోత్సహించిన దాఖలా లేదు. ఓల్గా లాంటి వారు మాత్రం తమ సొంత చిత్రాల్లో కథ, మాటల రచనను నిర్వహించారు. పూర్వాశ్రమ జర్నలిస్టు ఉమర్జీ కుమరన్ టీవీ సీరియళ్ళ మీదుగా, ఇటీవల సినీ సంభాషణల రచయిత్రి ('ఏ మాయ చేశావె' - 2010) అయ్యారు.

ప్రాచీన సాహిత్యంలో పలువురు తెలుగు కవయిత్రులున్నా, ఈ 80 ఏళ్ళ సినీ గీత రచన చరిత్రలో మహిళల పేర్లు చాలా కొద్ది. 1980లలో విజయలక్ష్మి ('విప్లవ శంఖం'), జ్యోతిర్మయి ('మూడు ముళ్ళు'), 2000లలో రాణి పులోజమా దేవి ('బుల్లెబ్బాయ్'), కిరణ్మయి ('మిస్సింగ్'), పి. సూర్యకుమారి ('తొలిచూపులోనే'), కొండముది అనూరాధ ('పవన్ - సుబ్బలక్ష్మి ప్రేమించుకున్నారట!') లాంటి కొందరే సినీ గీత రచనలో ప్రవేశించారు. అయితే, వీరెవరికీ పదే పదే అవకాశాలు వచ్చిన, ఇచ్చిన దాఖలాలు లేవు. ఫలితంగా ఈ గీత రచయిత్రులు ప్రాచుర్యానికి రాలేదు. మిగిలిన ఎన్ని రసాలున్నా, సినిమా పాట ప్రధానంగా శృంగార రస పోషకంగా విశృంఖలంగా వెలగడం కూడా ఈ మహిళల ప్రతిభకు ప్రధాన అవరోధం అయ్యుండవచ్చని కొందరి అభిప్రాయం. "ఏ 'రింగ రింగ...' లాంటి ప్రత్యేక నృత్య గీతమో రాయమంటే ఆడవాళ్ళం ఏం రాస్తాం!" అని కొన్నేళ్ళుగా దర్శకత్వ శాఖలో సహాయకురాలిగా పని చేస్తున్న ఓ యువతి నవ్వేశారు. పాటలు రాయడం కన్నా పాడడానికి కొత్త కోయిలల కోసం చూసే చిత్రసీమ, బాణీలు కట్టే పనిలో మటుకు మచ్చుకు ఒకరిద్దరు మహిళలకే స్థానం కల్పించింది. తెలుగు చిత్ర పరిశ్రమతో కలబడి, మహిళా సంగీత దర్శకురాలిగా నిలబడి, వాణిజ్య విజయాలు సైతం అందుకున్నది - వర్తమానంలో ఎం.ఎం. శ్రీలేఖ ఒక్కరే! స్వయంగా గాయని అయిన భానుమతి తమ చిత్రాలకు తరచూ తానే సంగీత దర్శకత్వ పర్యవేక్షణ జరిపితే, తరువాతి రోజుల్లో గాయని ఎస్. జానకి లాంటి కొందరే అడపాదడపా సంగీత నిర్దేశకత్వం వహించారు. తాజాగా గాయని కౌసల్య తొలిసారిగా సినీ సంగీత దర్శకత్వం వహిస్తున్నట్లు ప్రకటించారు.

స్థానమిస్తున్న డ్యాన్సు, కాస్ట్యూమ్‌లు

సినీ రంగంలో మహిళలు కొంత ఎక్కువ సంఖ్యలో కనిపించేదల్లా - నర్తకీమణులుగా! నృత్య నిర్దేశకత్వ విభాగంలో డ్యాన్సర్లుగా మొదలై, ఆ తరువాత డ్యాన్స్ అసిస్టెంట్లుగా చాలామంది మహిళలే కనిపిస్తారు. వారిలో కొందరు ఆఖరికి డ్యాన్స్ మాస్టర్లుగా విజయమూ సాధించారు. తార మాస్టర్, కళ మాస్టర్, బృంద, సుచిత్రా చంద్రబోస్ లాంటి వాళ్ళు నృత్య నిర్దేశకత్వంలో మహిళల సత్తా చాటారు. అలాగే, సినిమాల్లో పాత్రల తాలూకు వస్త్రధారణ, అలంకరణకు సంబంధించి ఇటీవల కొత్తగా ప్రాచుర్యంలోకి వస్తున్న 'స్టయిలింగ్' అనే విభాగంలో వనితల పేర్లు వినిపిస్తున్నాయి. "కాస్ట్యూమ్ విభాగంలోనే కొత్త పేరుతో పుట్టించిన శాఖ ఇది. ప్రధానంగా హీరోల సతీమణులు, దర్శకుల భార్యలు ఈ శాఖలో తమ ప్రమేయం చూపెడుతున్నారు" అని సినీ వర్గాలు తేల్చేశాయి. హీరో కమలహాసన్ చిత్రాలకు ఆయన భార్య వాణీ గణపతి కాస్ట్యూమ్స్ నిర్ణేత కావడంతో చాలా ఏళ్ళ క్రితమే ఇది మొదలైంది. అటు పైన సారిక, తాజాగా గౌతమి వరకు ఈ ధోరణి ప్రబలింది. ఆ మధ్య హీరో చిరంజీవికి ఆయన కుమార్తె సుస్మిత ఒకటి రెండు చిత్రాల్లో కాస్ట్యూమ్ డిజైనర్‌గా వ్యవహరించారు. హీరో పవన్ కల్యాణ్ సతీమణి రేణూ దేశాయ్, దర్శకుడు రాజమౌళి భార్య రమా రాజమౌళి (2009కి 'నంది' అవార్డు కూడా వచ్చింది), హీరో మహేష్‌బాబు భార్య నమ్రతా శిరోద్కర్, తాజాగా దర్శకుడు శ్రీను వైట్ల సతీమణి రూప సంతోషి తదితరుల పేర్లు తెరపై 'స్టయిలింగ్' రూపకర్తలుగా కనిపిస్తున్నాయి. గతంలో 'శివయ్య' తదితర చిత్రాల్లో ముఖ్య పాత్రధారణ చేసిన ఓ యువతి, ఆ తరువాత 'ఈ అబ్బాయి చాలా మంచోడు' సినిమా రోజుల నుంచి హీరో రవితేజకు 'పర్సనల్ కాస్ట్యూమర్'గా టైటిల్ కార్డుల్లో స్థిరపడ్డారు. అయితే, వీరిలో అందరికీ ఆ శాఖలో నైపుణ్యం ఉందని చెప్పలేం. "ప్రముఖుల కుటుంబ సభ్యులు కావడం మినహా, వారిలో అత్యధికులకు ఈ శాఖలో ప్రత్యేకించి నైపుణ్యం ఉందనలేం. ఇంట్లో ఎన్నడూ గుండీ కూడా కుట్టనివాళ్ళు ఇక్కడ దుస్తులు ఎలా సిద్ధం చేస్తారు! కాస్ట్యూమ్ సెలక్టర్లను పట్టుకొని డిజైనర్లు అనడం ఎంతవరకు సబబు" అని పలు చిత్రాలకు కార్యనిర్వాహక నిర్మాతగా బాధ్యతలు నిర్వహించిన కొమ్మినేని వెంకటేశ్వరరావు ప్రశ్నించారు. ఇలాంటి లలితమైన పనులతో పాటు విపరీతమైన శారీరక శ్రమ ఉన్న ఛాయాగ్రహణంలోనూ, తల తిరిగే ఆర్థిక వ్యవహారాలతో తలమునకలు కావాల్సిన చిత్ర నిర్మాణంలోనూ ఆడవాళ్ళు కొద్దిగా వస్తున్నారు. ఛాయాగ్రహణ శాఖలో బి.ఆర్. విజయలక్ష్మి (దర్శక, నిర్మాత స్వర్గీయ బి.ఆర్. పంతులు కుమార్తె), విజయశ్రీ (చిన్న ఎన్టీఆర్ 'సుబ్బు' చిత్ర ఛాయాగ్రాహకురాలు), ఫౌజియా ('మిత్ర్... మై ఫ్రెండ్' కెమెరా ఉమన్) లాంటి దక్షిణాది వనితలు కృషి చేస్తున్నారు. ఇక, 1930ల నాటి దాసరి కోటిరత్నం, 1940ల నాటి సి. కృష్ణవేణి లాంటి ప్రముఖ తారలు అప్పట్లోనే చిత్ర నిర్మాణం వైపు విస్తరించారు. అప్పటి నుంచి ఇటీవలి బెల్లంకొండ నాగలక్ష్మి, హీరో కృష్ణ కుమార్తె మంజుల, నిర్మాత అశ్వినీదత్ కుమార్తె చలసాని స్వప్నాదత్, నట - నిర్మాత మోహన్‌బాబు కుమార్తె మంచు లక్ష్మీప్రసన్న, తాజాగా ప్రవాస భారతీయురాలు నీలిమ తిరుమలశెట్టి వరకు కొందరు మహిళలు చిత్ర నిర్మాతలుగా వచ్చారు. "కానీ, వీళ్ళలో బెంగుళూరుకు చెందిన నారా జయశ్రీదేవి లాంటి ఒకరిద్దరు మినహా అందరూ సినీ రంగంలో పెద్ద స్థాయిలో స్థిరపడిన తమ అన్నలు, నాన్నల అండదండలతో చిత్ర నిర్మాణం చేపట్టిన వారే! అలా కాకుండా చిత్ర నిర్మాణం మీద ప్రేమతో కొత్తగా ఏ ఊరి నుంచో వచ్చి, పగలూ రాత్రీ సెట్‌లోనే ఉండి అన్ని పనులూ తామే చక్కదిద్దుకుంటున్నవాళ్ళు కారు" అని పేరు ప్రచురించవద్దన్న ఓ సీనియర్ నిర్మాత వివరించారు. **(మరిన్ని వివరాలు పైవారం)**

- రెంటాల జూనియర్

ముంబై మిడ్‌డే పత్రిక జర్నలిస్టు జ్యోతిర్మయి డే హత్యలో పేరు మోసిన అంతర్జాతీయ నేరగాడు చోటా రాజన్ హస్తం ఉందని పోలీసులు ప్రకటించటంతో మరోసారి మాఫియా ముఠాల కార్యకలాపాలు చర్చనీయాంశమయ్యాయి. మూడు దశాబ్దాల క్రితం ముంబై సినిమా థియేటర్ల దగ్గర దొంగటికెట్లు అమ్ముకొని చిన్నచిన్న నేరాలు చేసేవాడు రాజేంద్ర సదాశివ నికలాజీ. అలాంటివాడు నేడు ముంబై, భారత్‌లోని ఇతర ప్రధాన నగరాలను నేరస్థ ముఠాలతో గడగడలాడించే స్థాయికి ఎదుగుతాడని ఎవరూ ఊహించి ఉండరు. రాజన్ కార్యకలాపాలిప్పుడు అంతర్జాతీయ స్థాయిలో ఉన్నాయి. అనేక నగరాల్లో అతని నెట్‌వర్క్ ఉంది. ఆ వివరాలు..

చోటరాజన్ బడా డాన్

దావూద్ ఇబ్రహీంను పట్టుకొనేందుకు, అతని నెట్‌వర్క్, అనుచరులను దెబ్బతీసేందుకు కేంద్ర ప్రభుత్వ గూఢచార సంస్థ 'రా' చోటారాజన్‌తో సంబంధాలు ఏర్పరచుకుందని లోకం కోడై కూస్తోంది. రాజన్ అనుచరుడు ఒకడు ఇంటలిజన్స్ ఉన్నతాధికారి కారులో దొరకటమే అందుకు పెద్ద నిదర్శనం. పేరు మోసిన నేరగాళ్లతో ఇలాంటి సంబంధాలు పెట్టుకున్నందువలన ముంబైకి గాని దేశానికి గాని ఇంతవరకు ఒరిగిందేమీ లేదు. ఒక అవసరం కోసం ఇలాంటి వారిని చేరదీస్తే తరువాత వారే ఏకు మేకవుతారు. ఇపుడు జర్నలిస్టు హత్యతో పోలీసులు తలలు పట్టుకుంటున్నారు.

ముంబైలోని తిలక్ నగర్ ప్రాంతంలో 1980 దశకంలో సినిమా టికెట్లను బ్లాక్‌లో అమ్మే గ్యాంగ్ సభ్యుడు రాజేంద్ర. ఆ క్రమంలోనే అప్పటికి బడా రాజన్‌గా పేరుమోసిన రాజన్ నాయర్ అనే డాన్‌ను కలుసుకొని అతని అనుచరుడిగా మారాడు. బడా రాజన్ హత్య తరువాత ఆ గ్యాంగ్ నాయకుడిగా మారి చోటా రాజన్ అనే బిరుదు పొందాడు. కొంతకాలం పాటు అప్పటికే స్వంత ముఠాలను నడుపుతున్న దావూద్ ఇబ్రహీం, అరుణ్ గావ్లీలతో కలిసి ముంబైని పంచుకున్నాడు. ఆ క్రమంలో ఒక మాదకద్రవ్యాల లావాదేవీలో అరుణ్ గావ్లీ సోదరుడు పాపా గావ్లీ హత్యకు గురయ్యాడు. దీనికి చోటా రాజన్ కారణంగా బయటపడటంతో ప్రాణ రక్షణకోసం రాజన్ దుబాయ్ పారిపోయాడు. తరువాత దావూద్ ఇబ్రహీంతో కలిసి చోటా రాజన్ పనిచేశాడు. 1989లో దావూద్ సోదరుడు నూరా వివాహనికి రాజన్ ముంబై వచ్చాడు.

ముంబై బాంబు పేలుళ్ల తరువాత రాజన్-దావూద్ మధ్య విభేదాలు వచ్చాయి. అవి చివరికి 1993 పేలుళ్లతో తారా స్థాయికి చేరాయి. దానికి మతం రంగు కూడా పులిమారు. 1993 పేలుళ్లకు దావూద్ కారకుడని ప్రభుత్వం ప్రకటించింది. దావూద్ ముంబైని వదలి పోవటంతో రాజన్ తన స్థానాన్ని పటిష్ట పరచుకున్నాడు. దానికి తోడు కేంద్ర ప్రభుత్వ 'రా' కూడా దావూద్‌ను పట్టుకొనేందుకు రాజన్ ముఠాకు తన వద్ద ఉన్న సమాచారం అందించినట్లు చెబుతారు. దీంతో 1994లో దావూద్ మాదక ద్రవ్యాల రవాణాలో నమ్మినబంటుగా ఉన్న ఫిల్లుఖాన్ అలియాస్ భక్తియార్‌ను ఆకర్షించి బ్యాంకాక్‌లోని ఒక హోటల్ రూమ్‌కు రప్పించి నమ్మక ద్రోహం చేసినందుకు శిక్ష అనే పేరుతో చిత్ర హింసలు పెట్టి హత్య చేశాడు. ఇద్దరూ విదేశాల్లోనే ఉండి ముంబై నేర సామ్రాజ్యాన్ని ఏలేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలోనే ఒకరి నొకరు హతమార్చుకొనేందుకు కూడా ప్రయత్నించారు. ముంబై హోటల్ యజమాని వినోద్ షెట్టి ద్వారా 2000 సంవత్సరంలో చోటా రాజన్ బ్యాంకాక్‌లో ఉన్నట్లు దావూద్ తెలుసుకున్నాడు. తన సహాయకుడు చోటా షకీల్‌ను హోటల్ గదికి పీజా'ను అందచేసే వ్యక్తి వేషంలో పంపాడు. షకీల్ జరిపిన కాల్పుల్లో రాజన్ సన్నిహితుడు రోహిత్ వర్మ అతని భార్య మరణించారు. చోటారాజన్ హోటల్ గది కిటికీ నుంచి దూకి స్వల్పగాయాలతో తప్పించుకున్నాడు. తరువాత ఆసుపత్రిలో చేరి అక్కడి నుంచి కూడా తప్పించుకున్నాడు. మరుసటి ఏడాది వినోద్ షెట్టిని ముంబైలో చోటా రాజన్ అనుచరులు కాల్చి చంపి ప్రతీకారం తీర్చుకున్నారు. అంతటితో ఆగకుండా 2003లో దావూద్ ఆర్థికలావాదేవీలను చూసే కీలకమైన శరద్ షెట్టిని దుబాయ్‌లో రాజన్ అనుచరులు హత్య చేసి దావూద్‌కు తీవ్ర నష్టం కలిగించారు. అనేక బినామీ ఆస్తులు ఎక్కడ ఉన్నాయో దావూద్‌కు తెలియకుండా పోయాయి.

చోటా రాజన్ ఎక్కడ ఉన్నాడనేది నేరగాళ్లకు తప్ప పోలీసులకు తెలియదు. అతనెక్కడ ఉన్నా ముంబైలో తన భార్య సుజాతను నాయకురాలిగా చేసి దందా నిర్వహిస్తున్నాడు.అంతే కాదు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కరుడు గట్టిన నేరగాళ్లను చేరదీశాడు. వారిలో మన రాష్ట్రానికి చెందిన అజీజ్ రెడ్డి అనే వాడొకడు. ఇతగాడి పేరు వెంకటరెడ్డి. హైదరాబాద్‌లోని ముషీరాబాద్‌లో ఒక గల్లీ గూండా. ఇక్కడి నుంచి ముంబై వెళ్లిన క్రమంలో చోటారాజన్ అనుచరుడితో ఏర్పడిన పరిచయం రాజన్ అనుచరుడిని చేసింది. 1993 బాంబు పేలుళ్ల తరువాత ఆ కేసులో నిందితులను అంతంచేసే బాధ్యతను అజీజ్ రెడ్డికి రాజన్ అప్పగించాడు. పదమూడు హత్యల తరువాత పోలీసులు పట్టుకున్నారు. అన్ని కేసుల మాదిరి అజీజ్‌రెడ్డి కూడా ఎలాంటి శిక్ష పడకుండా విడుదలయ్యాడు. మైఖేల్ ఫెర్నాండో పేరుతో పాస్‌పోర్టు సంపాదించి రాజన్‌తో కలిసి సింగపూర్, బ్యాంకాక్ వెళ్లాడు. ఇండోనేషియాలో రాజన్ ఏర్పాటు చేసిన ఒక ఔషధ ఫ్యాక్టరీలో పనిచేశాడు. రాజన్‌తో విబేధాలొచ్చి ఉత్తర ప్రదేశ్‌కు మకాం మార్చాడు. అక్కడ సుభాష్ ఠాకూర్ గ్యాంగ్‌లో చేరి ముంబై బ్రాంచి నాయకుడయ్యాడు. అక్కడ పరిస్థితులు బాగులేకపోవటంతో తన స్వంతగ్యాంగ్‌ను ఏర్పాటు చేసుకొనేందుకు 2004లో హైదరాబాద్ వచ్చి అజీజ్ రెడ్డి పోలీసులకు పట్టుబడ్డాడు.

చోటా రాజన్ అందరి నోళ్లు కొట్టి సంపాదిస్తే చివరికి రాజన్ ఇంటికే కన్నంవేసి కోట్లు కొట్టేసిన ఘనుడు కూడా ఉన్నాడు. ముంబైలోని రాజన్ ఇంటి నుంచి తొమ్మిది కోట్ల విలువ చేసే నగలు, 50లక్షల నగదును బెంగుళూరులో మున్నా అనే వ్యక్తిని అరెస్టు చేశారు.మాంసం అమ్ముకుంటూ జీవించే మున్నా నేరాలకు పాల్పడి చివరికి రాజన్ ఇంట్లోనే చోరీ చేశాడు.

గోలీమార్ సినిమాలో ఒక పోలీసు అధికారి చేత గూండా గాంగ్‌లు ప్రత్యర్థులను ఎలా హతమార్చుతాయో చూపారు. దీనికి మూలం ముంబై పోలీస్ ఎన్‌కౌంటర్ స్పెషలిస్టు ప్రదీప్ శర్మ. ఇతగాడు 112 మంది నేరగాళ్లను ఎన్‌కౌంటర్ పేరుతో చంపేశాడు. చివరికి ఉద్యోగం నుంచి తొలగించబడ్డాడు. చోటా రాజన్‌తో సహా అన్ని పేరుమోసిన గ్యాంగులతో సంబంధాలు పెట్టుకొని ప్రత్యర్థులను హతమార్చేవాడని స్వయంగా చోటా రాజన్ చెప్పాడు. రాజన్ కార్యకలాపాలు ఒక్క మాఫియాకే పరిమితం కాలేదు. ముంబై పరిశ్రమల యజమానులు రంగంలోకి తీసుకొచ్చిన కార్మిక నాయకుల్లో దత్త సామంత్ ఒకరు. ఆయన ఎంపీగా కూడా గెలిచాడు. దత్త సామంత్‌ను 1997లో చోటా రాజన్ అనుచరులే హత్య చేశారు.

తాజా ఉదంతానికి వస్తే జర్నలిస్టు జ్యోతిర్మయి డేను చోటా రాజన్ హత్య చేయించాడని పోలీసులు ప్రకటించారు. కారణాలింకా వెల్లడి కావాల్సి ఉంది. అంతకు ముందు పోలీసులు అనేక అంశాలను మీడియాకు చెప్పారు. చోటా రాజన్‌తో జర్నలిస్టుకు సంబంధాలున్నాయని అందువలన రాజన్ ప్రత్యర్థులు డేను హత్య చేయించి ఉండవచ్చన్నది వాటిలో ఒకటి. తీరా ఆ రాజనే చంపించాడని పోలీసులు చెప్పారు. ఇదీ కట్టుకథేనా? లేక నిజమా అయితే అసలు కారణాలేమిటి? పోలీసులే వెల్లడించాల్సి ఉంది.

- సత్య

కంద వడ



కావలసిన పదార్థాలు

కంద : అర కిలో, పెసరపప్పు : 150 గ్రా, ఉల్లిపాయలు (పెద్దవి) : 5, అల్లం : చిన్నముక్క, పచ్చిమిర్చి : 10, జీలకర్ర : 1 చెంచా, ఉప్పు : తగినంత నూనె : పావుకిలో

తయారీ విధానం

పెసరపప్పును గంటసేపు నానబెట్టాలి. కందను చిన్న చిన్న ముక్కలుగా తరగాలి. పెసరపప్పు, కంద, అల్లం, పచ్చిమిర్చి, జీలకర్ర, ఉప్పు కలిపి మిక్సీలో వేసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. ఉల్లిపాయలు సన్నగా తరిగి ఈ ముద్దలో కలపాలి. స్టవ్‌మీద నూనె పెట్టి కాగనివ్వాలి. పిండిని వడలుగా చేతి మీద ఒత్తుకుని నూనెలో వేసి దోరగా వేయించాలి. ఇవి చిరుతిండిగానే కాక అన్నంతో తినడానికి కూడా బావుంటాయి.



ఆలూ వడ

కావలసిన పదార్థాలు:

బంగాళదుంపలు:అరకిలో, వెల్లుల్లి రేకులు :4, అల్లం:చిన్నముక్క, పచ్చిమిర్చి : 10, ఆవాలు, జీలకర్ర:1 చెంచా, కొత్తిమీర, కరివేపాకు :కొద్దిగా, వంటసోడా, పసుపు : చిటికెడు, ఉప్పు, నూనె: తగినంత, వడలోకి కావలసినవి: శనగపిండి:ఒకటిన్నర కప్పు,గోధుమపిండి :అరకప్పు, జీలకర్ర పొడి, కారం:చిటికెడు, కొత్తిమీర, ఉప్పు: తగినంత

తయారీ విధానం

బంగాళదుంపలను శుభ్రంగా కడిగి ఉడకబెట్టాలి. తరువాత తొక్కతీసి పెద్ద పెద్ద ముక్కలుగా కోసుకోవాలి. పచ్చిమిర్చి, అల్లం, వెల్లుల్లి, కొత్తిమీర కలిపి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. కొద్దిగా నూనెను వేడిచేసి ఆవాలు, జీలకర్ర పొడి, కరివేపాకు, పసుపు వేయాలి. రంగు మారిన తరువాత బంగాళదుంప ముక్కలు, ఉప్పు కూడా వేయ్యాలి. రెండు నిమషాలు వేగనిచ్చి గ్రైండ్ చేసుకున్న మిశ్రమాన్ని కూడా వేయాలి. ఐదు నిమిషాల తరువాత దించేసుకుని ఆ మిశ్రమాన్ని చల్లారబెట్టాలి. ఒక గిన్నెలోకి శనగపిండి, గోధుమపిండి, జీలకర్ర, ఉప్పు, కారం వంటసోడా వేసి కొద్దిగా నీరు చేర్చి చపాతీ పిండిలా కలుపు కోవాలి. ఈ పిండిని చిన్న చిన్న ఉండలుగా చేసుకుని చపాతీలా ఒత్తుకోవాలి. తరువాత కొద్దిగా బంగాళదుంప మిశ్రమాన్ని చపాతీలో పెట్టి అన్ని వైపుల నుండి మూసేసి వడలా వెడల్పుగా ఒత్తుకోవాలి. వీటిని నూనెలో వేయించాలి.

బీన్స్ వడ

కావలసిన పదార్థాలు

బీన్స్ :2 కప్పులు, ఉల్లిపాయ :1, పచ్చిమిర్చి:5 కొత్తిమీర, కరివేపాకు :1కట్ట, 1రెమ్మ అల్లం, వెల్లుల్లిపేస్ట్:1 చెంచా ఉప్పు, నూనె :తగినంత

తయారీ విధానం

బీన్స్‌ను నాలుగైదు గంటలపాటు నానబెట్టాలి. తరువాత నీళ్ల ఒంపేసి గ్రైండర్‌లో వేసి కొద్దిగా నీళ్ల జతచేసి మెత్తగా రుబ్బుకోవాలి. ఈ మిశ్రమంలో ఉల్లిపాయ, పచ్చిమిర్చి ముక్కలు, సన్నగా తరిగిన కరివేపాకు, కొత్తిమీర, అల్లం, వెల్లుల్లి పేస్ట్, ఉప్పు వేసి బాగా కలపాలి. కావాలనుకుంటే అరచెంచా గరం మసాలా పొడి కూడా వేసుకోవచ్చు. దీనిని ఉండలుగా చేసుకుని వెడల్పుగా ఒత్తుకోవాలి. వీటిని నూనెలో డీప్ ఫ్రై చేసుకోవాలి.





సగ్గుబియ్యం వడ

కావలసిన పదార్థాలు

సగ్గుబియ్యం :1కప్పు, వేరుశనగపొడి: 1/2 కప్పు, బంగాళదుంప :1, పచ్చిమిర్చి :7, ఉప్పు, నూనె: తగినంత

తయారీ విధానం

సగ్గుబియ్యాన్ని శుభ్రంగా కడిగి మూడు గంటలపాటు నానబెట్టి ఉంచాలి. బంగాళదుంప ఉడికించి తొక్క తీసి మెత్తగా చిదిమి పక్కన పెట్టుకోవాలి. నూనె తప్ప మిగిలిన పదార్థాలన్నిటినీ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని చిన్న చిన్న ఉండలుగా చేసుకుని వడల్లా వెడల్పుగా ఒత్తుకోవాలి. వీటిని ఎరుపు రంగు వచ్చే వరకూ నూనెలో వేయించాలి. ఇవి వేరుశనగ చట్నీతో బాగుంటాయి.

★

చూద్దామా

కేతవరంలో ఆదిమానవ దృశ్యం

తక్షశిలా పాటలీ పుత్రం/ హరప్పా మొహంజదారో / క్రోమాన్యన్ గుహాముఖాల్లో
చారిత్రక విభాత సంధ్యల/ మానవ కథ వికాసమెట్టిది?

శ్రీశ్రీ రాసిన ఈ వాక్యాలు చాలా మంది సాహితీ ప్రియుల నోటికి వస్తాయి. అయితే అందులోని చారిత్రిక జిజ్ఞాసను పట్టించుకోవడం అంత తేలిక కాదు. అయితే కాస్త దృష్టి పెట్టి చూస్తే మన చుట్టూనే బోలెడు చారిత్రిక సంపద వుంటుంది. కొంచెం వాకబు చేస్తే దర్శనీయ స్థలాల జాబితా తెలుస్తుంది. ఇప్పటికే పర్యాటక కేంద్రాలుగా ప్రసిద్ధమైన వాటి గురించి చెబుతారు తప్ప చూడదగినవి ఏవి అన్న ఆలోచన అందరికీ వుండదు. కనకనే టూరిస్టు స్పృహ, ఏదైనా సందర్శించాలన్న ఆసక్తి గల వారు ముందు చుట్టుపక్కల ఏమున్నాయని తెలుసుకోగలిగితే తర్వాత నిర్ణయించుకోవచ్చు. టూరిజం అంటే ప్రత్యేకంగా సెలవులు పెట్టి పనులు మానుకుని వెళ్లడమే కాదు. వెళ్లిన చోట్ల గల చారిత్రిక విశేషాలను చూడటం కూడా.

కర్నూలు పట్టణానికి బాగా దగ్గరగా వుండే కేతవరం గ్రామం వెలుపల గల కొండల్లో ఆది మానవులు గీసిన బొమ్మలు మానవ పరిణామ క్రమానికి సాక్షీభూతాలుగా కనిపిస్తాయి. వాస్తవానికి కర్నూలు జిల్లాలో ఆదిమానవుడి పాదఛాయలు చాలా చోట్ల వున్నాయి. కాశీ పాండ్యన్ 1977లో కలెక్టరుగా వున్నప్పుడు వీటిపై వ్యక్తిగతంగా కొంత కృషి చేశారు. ఎందుకంటే ఆ ఏడాది కర్నూలుకు ఆరు కిలోమీటర్ల దూరంలోని గార్గేయ పురం గ్రామంలో ఒక రైతు పొలం దున్నుతుండగా ఎద్దులు దిగబడిపోయాయి. భూమి మింగివేసిందని అందరూ అనుకున్నారు. దానిపై తహసీల్దారు నివేదిక చదివిన పాండ్యన్ అక్కడకు ప్రత్యేకాసక్తితో బయలుదేరి వెళ్లి ప్రత్యేకంగా పరిశీలించారు.

ఘటన జరిగిన చోట భూమిలోకి మార్గం కనిపించింది. దానికి ఫర్లాంగు దూరంలోనూ అలాంటిది వుంది. అక్కడ గ్రామ పొలిమేర రాయి మీద ప్రాచీన తెలుగు భాషలో గల అక్షరాలను పరిశీలిస్తే మూడు గ్రామాల పేర్లు కనిపించాయి. గార్గేయ పురం, కేతవరం, రంగ రాజ సముద్రం. ఇందులో మొదటి రెండు గ్రామాలు మాత్రమే వుండగా మూడవది అదృశ్యమై పోయింది. ఆ గ్రామం వున్నట్టు భావించే చోట ప్రవాహం వుండిన గుర్తులు కనిపించాయి. అంటే ఒకప్పటికీ పెన్నా నదీ ప్రవాహం వుండేదని పాండ్యన్ అభిప్రాయపడ్డారు. దానిపై ఆయన మరుగుపడ్డ వారసత్వం పేరిట ఒక పుస్తకం రాశారు.

చరిత్ర పూర్వ మానవుల అవశేషాలకు సంబంధించినంత వరకూ కర్నూలు జిల్లా ఒక భాండాగారమేనని ఆంధ్ర ప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ పక్షాన ప్రచురించిన తొలి సంపుటిలో పరిశోధకులు ఎం.వి.కృష్ణశాస్త్రి పేర్కొన్నారు. పురావస్తు మ్యూజియం శాఖ, భారత పురావస్తు పరిశోధన శాఖల వారు కర్నూలు జిల్లాలో బృహత్ శిలా యుగం నాటి శ్మశానాలను గురించి విస్తారమైన సమాచారమిచ్చారు. జిల్లాలో చాలా చోట్ల ఇలాంటివి బయట పడ్డాయి. అల్లూరు, ఆరేళ్ల, మారెళ్ల గుట్ట, బుగ్గవాని పల్లె, దోర్నాల, దిగువ మెట్ట, కోసగి, అవుకు, పాతపాడు, పాణ్యం, రామాపురం, తిమ్మాపురం, వీరాపురం... వంటి చాలా చోట్ల ఇలాంటివి బయటపడ్డాయి. బనగాన పల్లె ప్రాంతంలోని పాతపాడులో బాగా నునుపు చేసిన మట్టి పాత్రలు దొరికాయి. మామూలుగా ఆ కాలపు శ్మశాన సరంజామాలో నిక్షిప్తం చేసే కూజాల్లాంటివి ఎన్నో లభ్యమైనాయి. అలాగే నవీన శిలాయుగానికి చెందిన ఇనుప వస్తువులు, పాల పాత్ర, బాణం కొనలు, చాకు, బ్లేడ్లు వంటివి వున్నాయట.

వీటి సంగతి అలా వుంచి మళ్లీ శిలా చిత్రాల దగ్గరకు వస్తే – చరిత్ర పూర్వదశలోని కళ గురించి తెలియజేయడానికి ఈ మాట వాడుతుంటారు. గుహల రాతి ఉపరితలాల మీద, శిలాశ్రయాల మీద, విడివిడిగా రాతి బండల మీద ఈ బొమ్మలు కనిపిస్తాయి. ఆంధ్రప్రదేశ్‌లో కనిపించే శిలా చిత్రాలు ప్రధానంగా మధ్య శిలా యుగం నాటివి. తర్వాత చరిత్ర పూర్వయుగం, సంధియుగం, మధ్య యుగాల దశలు కూడా వీటిలో ప్రతిఫలించాయి. మధ్య శిలాయుగం చిత్రాల్లో 200 వరకూ బొమ్మలుంటాయి. అడవి జంతువులు వీటిలో ప్రధానంగా కనిపిస్తాయి. కర్నూలు సమీపంలోని దూపాడు గట్టు, కేతవరం పులిచెర్ల సముదాయం వీటిలో ఒకటి. వీటిని చేరుకోవడం కష్టమైన పనే. వూరి బయట కొండల పైకి ఎక్కితే ఈ చిత్రాలు కనిపిస్తాయి. కాకపోతే ఆ కొండల పైకి ఎక్కడం మాత్రం కష్టమైన పనే. మూడేళ్ల కిందట ఈ రచయిత వెళ్లినపుడు చాలా అవస్థ పడాల్సి



వచ్చింది. ఎన్ని అవస్థలు పడినా పైకి వెళ్లి తొలి మానవుడి చిత్ర కళా కౌశలం చూశాక మహదానందమే కలిగింది.

కేతవరం కొండ గుహల్లో మొత్తం వందకు పైగా ఆదికాలపు శిలా చిత్రాలుంటాయి. క్రీ.పూ.6000 నుంచి క్రీశ200 మధ్య కాలంలో వాటిని గీశారు. వాటిలో ఆ కాలపు మానవుల జీవిత విధానం చిత్రితమైంది. కొన్ని చిత్రాలైతే సింధు నాగరికతకు సమకాలీనమైనవిగా గుర్తించారు. ఇంకొన్ని అంతకన్నా పూర్వమే గీసినవి. రకరకాల జంతువులు, వాటిపై బాణాలు వేయడం, మనుషులు, రకరకాల భంగిమలు ఈ బొమ్మల్లో మనం చూడగలుగుతాము. పాండిచ్చేరికి చెందిన పురావస్తు తవ్వకాల నిపుణుడు డా॥చంద్రమౌళి 20 ఏళ్ల కిందటి నుంచి వీటిపై పరిశోధన చేస్తున్నారు. ఈ శిలా చిత్రాలు 6000 ఏళ్ల కాలం పాటు మానవ నాగరికతా పరిణామాన్ని చెబుతాయని ఆయన అంటారు. ఈ బొమ్మలు ఎక్కువగా ఎర్ర రంగుతో గీయబడినవే. కొన్ని సార్లు నలుపులోనూ వున్నాయి గాని తక్కువ.

కేతవరం కొండ శిలలపై గీసిన చిత్రాల్లో జింకలు, దుప్పి, చెవుల పిల్లి, హైనా, కుందేలు, పాములు తదితర సరీసృపాలు, కప్ప వంటివి వున్నాయి. ఇప్పుడు చిన్న పిల్లలు వేసే బొమ్మల్లా తమాషాగా వున్నా వాటిలో చాలా నాగరికత వుందన్న విషయం కూడా మనకు అర్థమై పోయేలా వుంటాయి. వాటిని ప్రత్యక్షంగా చూసేప్పుడు చరిత్ర అడుగుల చప్పుడు వింటున్న...సమాజ పరిణామ క్రమం చూస్తున్న అనుభూతి కలుగుతుంది. చిత్రాలను గీయడంలోనూ పరిణతి క్రమంగా పెరగడం మనం గమనిస్తాము. మొదట పైభాగం బాగా వేసి కిందకు వచ్చే కొద్ది సరిగ్గా లేకపోవడం జరిగితే తర్వాత కాలంలో బొమ్మంతా బాగా వేయగలిగారని అర్థమవుతుంది.

వేట కార్యక్రమం జయప్రదమైన తర్వాత గుంపు పెద్ద నాయకత్వంలో నృత్యం జరిగే దృశ్యాలు చాలా చిత్రాల్లో వుంటాయి. ఆది మానవులలో విశ్వాసాలు మొదలైన క్రమం కూడా ఇక్కడ చిత్రాల్లో మనకు కనిపిస్తుంది. వేటకు ముందు మాంత్రికుడు ఏవో క్రతువులు నిర్వహించిన వైనం కూడా చిత్రించబడింది. ఒక విధమైన భూత చిహ్నం కూడా ఇక్కడ కనిపిస్తుంది. ఇదే కాలంలో ప్రపంచంలో వివిధ నాగరికతలు గల దేశాలలో దొరికిన ఆది శిలా చిత్రాలలోని భూత చిత్తరువుకు ఇది దగ్గరగా వుంటుంది. ఈ చిత్రాల్లో స్త్రీలు కనిపించరు. మానవాకృతిని చిత్రించేప్పుడు స్త్రీని వేయలేకపోవడం ఇందుకు కారణమై వుండాలి. ఎక్కడైనా లైంగిక దృశ్యాలు చిత్రించినపుడు మాత్రం స్త్రీని దుర్బలంగా ద్వితీయ శ్రేణి అవయవాలు లేకుండా చిత్రించారని పరిశోధకులు చెబుతున్నారు. ముసుగు వేసుకున్న మానవాకృతులు కూడా కేతవరం- పులిచెర్ల సముదాయంలో మనకు కనిపిస్తాయి.

ఈ చిత్రాలతో పాటు కేతవరంలో రాతలు కూడా వున్నాయి. నగిషీ చెక్కిన బ్రహ్మీలిపిలో వున్నాయి. 'కూన పంజర్ల' అని రాసివుంది. స్వస్తికతో మత చిహ్నాలు వున్నాయి. ఈ విధంగా ఆదిమ సమాజం నాటి నుంచి తదుపరి పరిణామ క్రమం వరకూ చిత్రించే బొమ్మలు మనకు ఈ ప్రాంతాల్లో కనిపిస్తాయి. కేతవరం చిత్రాల్లో జంతువులు మానవాకృతులు గాక హస్త ముద్రలు కూడా వుండటం అరుదైన విశేషం.

ఎర్రరంగు బొమ్మపై నలుపు రంగుతో మరో బొమ్మ గీయడం కూడా కనిపిస్తుంది.అంటే తర్వాత గీశారన్నమాట. ఎరుపు రంగులో కూడా చిక్కదనం క్రమంగా మెరుగుపడటం మానవుల క్రమానుగత పరిణామాన్నే సూచిస్తుంది.రంగును బట్టి మాత్రమే కాక బొమ్మల స్వభావం రీత్యాకూడా. ఈ రంగులో బొమ్మలు వేయడం మొదలెట్టేసరికి మనుషులు బరిసెలు పట్టుకోవడం కనిపిస్తుంది. చక్రాలు, బళ్లు కూడా వుంటాయి. వీటిని బట్టి ఈ బొమ్మలు నవీన శిలాయుగానంతర తొలి దశకు సంబంధించినవై వుండొచ్చని పరిశోధకులు అంచనా వేశారు.

కేతవరం వాస్తవానికి దేశంలోనే చాలా ముఖ్యమైన శిలాచిత్ర కేంద్రం. దాన్ని అదృశ్యమయ్యే ప్రమాదం వున్న చోటుగా కూడా గుర్తించారు. కాని ప్రభుత్వాలకు చరిత్ర పట్ల ఆసక్తి లేకపోవడం వల్ల నిర్లక్ష్యానికి గురైంది. ఆ ప్రదేశాన్ని పరిరక్షించకపోవడమే కాదు, అక్కడ ఎడాపెడా క్వారీల తవ్వకానికి కూడా అనుమతి నిచ్చింది. అందుకే వూళ్లోకి వెళ్లినప్పటి నుంచి క్వారీల తవ్వకమే కనిపిస్తుంది. ఇంత జరుగుతున్నా పురావస్తు శాఖ కూడా కిమ్మనకుండా వుండిపోయింది.

అనేక విమర్శల అనంతరం కొద్ది కాలం కిందటనే ప్రభుత్వం కేతవరం శిలా చిత్రాల రక్షణకు రంగంలోకి దిగింది. ఇందిరాగాంధీ జాతీయ కళల కేంద్రం తరపున నిపుణుల బృందం ఆ ప్రదేశాన్ని సందర్శించింది. పురాతత్వ తవ్వకాలు, జానపద కళలు, చరిత్ర పరిశోధన, మానవ సమాజ శాస్త్రాలకు చెందిన ఆరుగురు నిపుణులు కేతవరంలో రెండు రోజుల పాటు పరిశీలన జరిపిన ఈ ప్రాజెక్టుకు 'ఆదిదృశ్యం' అని పేరు పెట్టారు.

ఇప్పటి వరకూ ఈ స్థలంలో ప్రభుత్వాలు తీసుకున్న ప్రత్యేక చర్యలేమీ లేవు. పురావస్తు శాఖ నోటీసు బోర్డు తప్ప దాని అమూల్య ప్రాధాన్యతను తెలిపే బోర్డులు కూడా లేవు. పైగా చుట్టూ కొండలు తుప్పలు వుండటంలో ఎవరూ ఆ పైకి వెళ్లే సాహసం చేయడం దుస్సాధ్యం. రక్షించే మాట ఎలా వున్నా ప్రభుత్వ శాఖల జోక్యం తర్వాత వాటిని సామాన్యులు చూసే అవకాశం కూడా తగ్గిపోతున్నది. తగు రక్షణలతో ఎవరైనా చూడటానికి వీలు కలిగించడమే ఇప్పుడు జరగాల్సింది. ఇప్పుడు సమాజంలో పెరుగుతున్న మూఢనమ్మకాలను పోగొట్టడానికి మానవ పరిణామ క్రమాన్ని చారిత్రిక దశలను శాస్త్రీయంగా తెలుసుకోవడం కూడా ఒక మార్గం. ఈ శిలా చిత్రాలు అలాంటి అవగాహన ఇస్తాయనడంలో సందేహం లేదు గాని అంతకంటే కొన్ని వేల సంవత్సరాల కిందట మానవులు గీసిన బొమ్మలను చూస్తున్నామన్న అనుభూతి అంతకంటే కొన్ని రెట్లు అధికంగా ముప్పిరిగొంటుంది.

వెంటనే మీ చుట్టుపక్కల వున్న చారిత్రిక విశేషాలను వాకబు చేస్తే ఇలాంటివి ఏవో వుండనే వుంటాయి మరి.!

- తెర



పదిహేనుకే పసందైన భోజనం

-పి. బాలకృష్ణ, నెల్లూరు

అవును ఇది నిజం. ఇందులో ఎలాంటి మాయ లేదు. మర్మం లేదు. కేవలం పదిహేను రూపాయలకే పసందైన భోజనం. పౌష్టికాహారం అందుతుంది. నెల్లూరు జిల్లాలో పండే బియ్యంతో వండిన అన్నం, నాలుగు కూరలు, మజ్జిగ పదిహేను రూపాయలకే. మాంసాహార ప్రియులు మరో పది రూపాయలు అదనంగా చెల్లిస్తే కోడి కూర కూడా వడ్డిస్తారు. ఈ పదిహేను రూపాయల భోజనం వెనక పెద్ద కథే వుంది. ఎంతో కృషి, పట్టుదల, అంకితభావం, ఓర్పు నిబద్ధత, సేవాతత్పరత పెనవేసుకుని వున్నాయి.

మధ్యాహ్నం పూట ఆకలై నాలుగు మెతుకుల కోసం ఏ మెస్‌కో, సాధారణ హోటల్‌కో వెళ్లినా రు.30 నుంచి రు.50 వరకు చెల్లించాల్సిందే.. అంతకన్నా రూపాయి తగ్గినా భోజనం కరువే... క్షుద్బాధ తీర్చుకోవడానికి ఎంతైనా పెట్టాల్సిందే. పనిపాటలు చేసుకునేవారికి, సామాన్యులకు ఇది పెనుభారమే.. ఈ నేపథ్యంలో ఓ వ్యక్తికి అపురూపమైన ఆలోచన తట్టింది. అదే రూ. 15కే భోజనం...15కు భోజనం ఏంటా అని ఆశ్చర్యపోవచ్చు...నిజమే.. బహుశా రాష్ట్రంలో ఎక్కడా కూడా ఉండకపోవచ్చు. ఎంతో ఉన్నతాశయంతో పౌష్టికాహారం అందించాలని ఈ సదుపాయాన్ని ఏర్పాటు చేశారు సుంకర ఆదినారాయణ. నెల్లూరు నగరానికి తొమ్మిది కిలో మీటర్ల దూరంలోని దామరమడుగు గ్రామం ఈ మహత్కార్యానికి కేంద్ర బిందువు.



ఆశయం గొప్పదైతే తప్పక ఆచరణకు నోచుకుంటుంది. మనీ కోసం మంచినీటిని సైతం అమ్ముకుంటున్న ఈ రోజుల్లో .... నిత్యావసరాల ధరలు చుక్కలనంటిన ఈ రోజుల్లో... పదిహేను రూపాయలకే భోజనం అందివ్వడమంటే చిన్న విషయం కాదు. సామాన్యుడు పచ్చడి మెతుకులకు నోచుకోని దయనీయ పరిస్థితి నేడు మన ముందుంది. ఇలాంటి సమయంలో సామాన్య ప్రజలకు కనీసధరకు పౌష్టికాహారం అందించాలనే సంకల్పం సుంకర ఆదినారాయణకు కలిగింది. నెల్లూరు నగరంలో దుకాణాల్లో చాలీచాలని జీతాలతో పెరుగన్నం, పచ్చడి మెతుకులతో బతుకుబండిని లాగిస్తున్న యువతకు మంచి ఆరోగ్యకరమైన భోజనం అందించాలనే తపన ఆయన మనస్సులో నాటుకొంది. మంచి సంకల్పం ఉంటే ఏదైనా సాధ్యమని నమ్మిన ఆయన అనుకున్నదే తడవుగా ఆచరణలో పెట్టారు. నెల్లూరు నగరానికి ఎనిమిది కిలోమీటర్ల దూరంలోని దామరమడుగు గ్రామంలో ఎస్‌విఎస్ (సుంకర వెంకటసుబ్బయ్య ఆరోగ్య పోషక ఆహార ట్రస్టు) ఏర్పాటుచేశారు. నెల్లూరు నగరంలో కేవలం 15 రూపాయలకే పౌష్టికాహారం అందిస్తూ, ఆరోగ్య పరిరక్షణకు తన వంతు కృషి చేస్తున్నారు. ఈ సదాశయ సాధనకోసం ఓ యజ్ఞంలా రాత్రనక, పగలనకా శ్రమిస్తూ ముందుకుపోతున్నారు.

అత్యంత నిరుపేద కుటుంబంలో పుట్టి కష్టాలను పెట్టుబడిగా పెట్టి, తనకంటూ ఓ స్థానం సంపాదించుకున్నారు. కోళ్ల వ్యాపారంతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. నెల్లూరు నగరంలో ఎస్.ఎస్. చికెన్ నడుపుతున్న ఆయన కుటుంబ బాధ్యతలు పూర్తిచేశారు. తొలినాళ్ల నుండి ఆదర్శ భావాలనున్న ఆదినారాయణలో ప్రజలకు ఏదో చేయాలనే ఆలోచన ఉండేది. 64 ఏళ్ల వయసులో తిని ఇంట్లో కూర్చోకుండా పది మందికి పని కల్పించాలి, సమాజానికి ఉపయోగపడాలి అని సంకల్పించారు. నెల్లూరుకు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో దామరమడుగు గ్రామం వుంది. ఇది కమ్యూనిస్టుల కంచుకోట. తండ్రి సుంకర వెంకటసుబ్బయ్య పార్టీలో చురుకైన నాయకుడు. చిన్ననాటి నుండి మంచి ఆదర్శ భావాలు కలిగిన ఆయన చిన్ననాటి నుండి అనేక కష్టనష్టాలు చవిచూశారు. కృషి, పట్టుదల పెట్టుబడిగా వ్యాపార రంగంలోకి వెళ్లారు. ఎక్కడ ఉన్నా పదిమందికీ సహాయపడాలనే మంచి ఆలోచన ఆయనది. అప్పట్లో నెల్లూరు డా॥ రామచంద్రా రెడ్డి ఆసుపత్రి సూపరింటెండెంట్ డా॥శేషారెడ్డి ఆరోగ్య పరిరక్షణకు ప్రచారం చేసేవారు. చిన్న చిన్న చిట్కాలతో ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలో చెప్పేవారు. ప్రాథమిక చికిత్సకు సంబంధించిన సలహాలు, సూచనలు చేసేవారు. అది ఆయన మనస్సులో నాటుకుంది. 'ఎంత సంపద ఉన్నా మంచి ఆరోగ్యం లేకపోతే వృధా' అనే విషయాన్ని ఆయన నమ్ముతారు. ఆరోగ్యమే మహా భాగ్యమని విశ్వసిస్తారు. తన దగ్గర పనిచేసే వారి ఆరోగ్యం గురించి కూడా శ్రద్ధ తీసుకుంటుంటారు. పిల్లలంతా ప్రయోజకులయ్యాక కొంతకాలం వివిధ అంశాలను అధ్యయనం చేశారు. సమాజానికి తన చేతనైన సహాయం చేయాలనే ఆలోచన ఎప్పటి నుండో ఉంది. దానికి ఒక రోజు వచ్చింది.

సేల్స్ గరల్స్ భోజనం చూసి.....

ఒకరోజు ఆదినారాయణ తన పెద్ద కుమార్తె సంధ్యతో కలిసి నెల్లూరు నగరం కాపువీధిలోని మిలాన్ బట్టల దుకాణానికి వెళ్లారు. అక్కడ బట్టలు కొనుగోలు చేసేసరికి మధ్యాహ్నం 2 గంటలు అయ్యింది. ఇంతలో అక్కడ పనిచేసే అమ్మాయిలు చిన్న సోపు బాక్స్ లాంటి డబ్బాలు తీసుకొని మిద్దెమీదకు వెళ్లడం గమనించారు. ఉండబట్టలేక 'అమ్మా అది ఏంటీ?' అని అడిగారు. 'భోజనం సార్' అని చెప్పడంతో ఆయనకు మతిపోయినంత పనైంది. ఇంత చిన్న బాక్స్‌లో భోజనం చేసి ఎలా పనిచేస్తారనే ఆశ్చర్యం కలిగింది. అందులో ఏముందోనని చూస్తే ఏముంది? ఒకరి బాక్స్‌లో పెరుగన్నం... మరో అమ్మాయి బాక్సులో పచ్చడన్నం కనిపించింది. అందుకు కారణాలు తెలుసుకున్నారు. నెల్లూరు నగరంలో సుమారు ఐదువేల మంది ఇలా దుకాణాల్లో





పనిచేస్తున్నారు. వారు ఇతర గ్రామీణ ప్రాంతాల నుండి నగరానికి వస్తారు. ఇక్కడకు రావాలంటే ఉదయం 6 గంటలకు ఇళ్ల దగ్గర బయలుదేరాలి. దీంతో రాత్రి మిగిలిన అన్నం తీసుకొని దానిలో కొంత పెరుగు లేదా గంజి కలుపుకొని వెంట తెచ్చుకుంటారు. మరి కొందరు ఉదయం అన్నం వండుకున్నా పచ్చడో..ఊరగాయో అందులో పెట్టుకు తెచ్చుకుంటున్నారు. 18 నుండి 25 సంవత్సరాల వయస్సుగల మహిళలు పౌష్టికాహారం లేని భోజనం చేసి రేపు వివాహం అయ్యాక పిల్లలు పుడితే ఆరోగ్య సమస్యలు వస్తాయని గ్రహించారు. అనేక మంది పిల్లల మొహాల్లో కళ లేదు. రక్తహీనతతో బాధపడడం గమనించారు. షాపు యజమానులు ఇచ్చే రెండు, మూడు వేల రూపాయలకు బయట భోజనం చేయలేని పరిస్థితి. అప్పుడే ఆయన మనస్సులో ఒక సంకల్పం బలంగా నాటుకుంది. ఇలా పౌష్టికాహారం లేని వారికోసం ఏదైనా చేయాలనే ఆలోచన అప్పుడే మొదలైంది. వెంటనే ఆరునెలలుపాటు నెల్లూరు నగరంలో వివిధ వర్గాలవారిని అధ్యయనం చేశారు. ఆటో వర్కర్స్, విద్యార్థులను పరిశీలించారు. రోజంతా కష్టపడి మధ్యాహ్నం ఎక్కడైనా 20, 30 రూపాయలకు దొరికే మసాలా అన్నం తినడం గమనించారు. ఏదో కడుపు నింపుకోవడానికి తప్ప అందులో ఏముందో తెలియని పరిస్థితి. మసాలాలు ఎక్కువ తినడం వలన అనేక మంది గ్యాస్ ట్రబుల్స్, ఇతర జబ్బులు బారిన పడుతున్న విషయాన్ని గమనించారు. అలాగే విద్యార్థులు కూడా రోడ్డు పక్కన ఏది దొరికితే అది తిని పొట్ట నింపుకుంటున్నారు. నెల్లూరు నగరంలో 250 గ్రాముల పెరుగన్నం 30 నుండి 40 రూపాయలు దండుకుంటున్నారు. ఎక్కడా రూ 30 తక్కువగా ప్లేట్ భోజనం దొరకడం లేదు. ఎదిగే వయస్సులో మంచి భోజనం చేయకపోతే జీవితమంతా రోగాలు తప్పవు. ఈ విషయం తెలిసినా మంచి తిండి తినలేనితనం. దేశ భవిష్యత్ యువత చేతిలో ఉందంటారు. అలాంటిది పౌష్టికాహారం తీసుకోకుండా కేవలం కడుపు నింపుకోడానికే ప్రయత్నం చేయడం ఆయన మనస్సును కదిలించింది.. ఇది ఎస్.వి.ఎస్ ట్రస్టు ఏర్పాటుకు నాంది అయ్యింది.

ఆరునెలల అధ్యయనం

నెల్లూరు నగరంలో వివిధ రంగాల ప్రజల స్థితిగతులను లోతుగా అధ్యయనం చేసిన ఆయన ఆరునెలలపాటు మార్కెట్‌ను పరిశీలించారు. కూరగాయల ధరలు ఎలా ఉన్నాయి? రైతుల నుండి ఎంతకు కొంటున్నారు? మార్కెట్‌లో ఎలా అమ్ముతున్నారో తెలుసుకున్నారు. రైతుల వద్ద కొనుగోలు చేసిన దానికి ఇక్కడ మార్కెట్ ధరలకు మూడు రెట్ల వ్యత్యాసం ఉడడం గమనించారు. మనిషి వ్యాపార దృష్టితో పని చేస్తుండడంతో సామాన్యులను ధరలు అందుబాటులో ఉండడం లేదని గమనించారు. ప్రస్తుతం ఉన్న ధరల నేపథ్యంలో తక్కువ ధరలకు పౌష్టికాహారం ఎలా పెట్టవచ్చో కొందరితో సంప్రదించారు. మార్కెట్‌లో సరకులు కొనుగోలుచేస్తే మంచి భోజనాన్ని సరసమైన ధరలకు పెట్టలేమని గ్రహించారు. ఇక తానే స్వంతంగా వ్యవసాయం చేయాలని నిర్ణయించారు. తొలత రైతు అయినప్పటికీ ఇతర వ్యాపారాల రీత్యా సేద్యానికి దూరంగా ఉన్నారు. నెల్లూరులో కాపురం ఉంటున్న ఆయన కేవలం పదిమందికి భోజనం పెట్టాలనే ఆశయంలో తన సతీమణి సులోచనను తీసుకొని నెల్లూరుకు ఎనిమిది కిలోమీటర్ల దూరంలోని దామరమడుగు గ్రామంలోని పంటపొలాలకు చేరారు. తన సొంత పొలంలో ఇందుకోసం ఒక భవనాన్ని కట్టించారు. తన పొలంలో కూరగాయల సాగు మొదలుపెట్టారు. మూడు ఎకరాల్లో వర్మీ కంపోస్టు ఎరువు మాత్రమే వాడి వివిధ రకాల కూరగాయలు పండిస్తున్నారు. సొరకాయ, బీరకాయ, దోసకాయ, బెండకాయ, వంకాయ, ఆకుకూరలు పండిస్తున్నారు. టమాటా, కొన్ని ఆకు కూరలు మాత్రమే బయట కొనుగోలు చేస్తున్నారు. వీటితోపాటు వరిసాగు సాగుతోంది. మరోవైపు షుగర్ పేషెంట్లు మసూరి బియ్యం తినకూడదని డాక్టర్లు చెబుతుండడంతో చుట్టుపక్కల పొలాల్లో రసాయన ఎరువులు లేకుండా పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధరకన్నా ఎక్కువ చెల్లించి తీసుకుంటున్నారు. ముందుగానే రైతులకు చెప్పి కేవలం వర్మీ కంపోస్టు ద్వారా పండించిన ధాన్యాన్నే కొంటున్నారు. నెల్లూరు మొలగొలుకులు మాత్రమే వాడుతున్నారు. ముందుగానే అవసరమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తారు. మిల్లులో వచ్చిన వరి పొట్టును వంటకు అవసరమైన స్టీమ్‌కు వాడుకుంటున్నారు. రీసైకిలింగ్ ద్వారా గ్యాస్, కట్టెల అవసరం లేకుండా సాంకేతిక పరిజ్ఞానంతో వంటను పూర్తిచేస్తున్నారు.

అత్యంత సాంకేతిక పరికరాలతో వంటకాలు

అత్యంత సాంకేతిక పరిజ్ఞానంతో వంట తయారౌతుంది. కేవలం నాలుగు గంటల వ్యవధిలో ఐదు వేలమందికి వంటను సిద్ధం చేయ[illegible]వసరమైన సదుపాయం ఉంది. ముందుగా ఇందుకు సంబంధించిన అధ్యయనం కూడా చేశారాయన. కోయంబత్తూరు వెళ్లి అక్కడ వివిధ రకాల వంట పరికరాలను



పరిశీలించారు. తిరుపతిలో 'హరేరామ హరేకృష్ణ హరేహరే' వారు పెద్దఎత్తున ఒకేసారి వంట చేయడానికి అవసరమైన ఏర్పాట్లు ఎలా చేశారో చూశారు. అక్కడి నుండి కోయంబత్తూరు వెళ్లి ఇక్కడకు అవసరమైన పరికరాలు కొనుగోలుచేశారు. ప్రస్తుతం ఇక్కడ ఐదు కుక్కర్లున్నాయి. ఒక్కో కుక్కరు 60 కేజీలు ఉడుకుతుంది. ఒకేసారి 1600 మందికి భోజనం చేయడానికి అవసరమైన పరికరాలున్నాయి. ఐదువేల మందికి ఒకేసారి సాంబారు వండడానికి అవసరమైన కుక్కరుంది. ఎక్కడలేని కొత్త యంత్రాలు ఇక్కడ మనకు కన్పిస్తాయి. కూరగాయలు తరిగే యంత్రం, పచ్చడి కొట్టే యంత్రం ఇక్కడున్నాయి. మరో వారంలో మరికొన్ని యంత్రాలు కొనుగోలు చేయడానికి అర్డర్ పెట్టారు. 75 కేజీలు బియ్యం ఉడకగల మరో నాలుగు కుక్కర్లను తీసుకొస్తున్నారు. మరో విషయం ఏమిటంటే గ్యాస్, కట్టెలు లేకుండా భోజనం చేయడం, స్టీమ్ ద్వారా, స్టీల్ పైపుల ద్వారా వంట వండుతున్నారు. వడ్ల పొట్టును స్టీమ్‌చేసి అందులో నుండి వచ్చే వేడితో వంట సిద్ధం చేస్తున్నారు. ఇక్కడ కూరలకు అవసరమైన పప్పులు, ధాన్యాల కొనుగోలుకు కొత్తరకం పద్ధతిని అవలంభిస్తున్నారు. మైసూరు లోని సిఆర్‌డిఆర్‌ఐ (సెంటర్ ఫుడ్ ట్రైనింగ్ రీసెర్స్ ఇన్‌స్టిట్యూషన్) వెళ్లి అక్కడ రైతుల నుండి నేరుగా పప్పులు కొనుగోలు చేస్తున్నారు. శనగలు, పెసలు, మినుములు, కందులు కర్నాటక నుండి దిగుమతి చేసుకుంటున్నారు.

రూ 5 కే మినరల్ వాటర్ క్యాన్

నెల్లూరు నగరంలో మంచినీటి వ్యాపారం కోట్లలో సాగుతోంది. ఒక్క గ్లాస్ నీళ్లు ఒక రూపాయి, కూలింగ్‌లో పెడితే రెండు రూపాయలు. ఇక వాటర్ క్యాన్ పాతిక రూపాయలు. మంచి నీటిని అందించాలనే ఆలోచన వచ్చిందే తడవుగా అక్కడ వాటర్ ప్లాంట్ ఏర్పాటుచేశారు. అత్యంత ఖరీదు అయినా పేదలకు మినరల్ వాటర్ అందివ్వాలనే ఆలోచనతో కేవలం ఐదు రూపాయలకే 20 లీటర్లు ఇస్తున్నారు. రోజుకు నాలుగు వేల లీటర్ల వాటర్ ఉత్పత్తి అవుతోంది. దీంతో చుట్టుపక్కల వాళ్లు ఇక్కడకు వచ్చి నీటిని తీసుకువెళుతున్నారు. భోజన కేంద్రంలో కూడా ఉచితంగా మినరల్ వాటర్ సరఫరా చేస్తున్నారు. నిరుపేదలకు మంచి నీటి కష్టాలు తీర్చాలనే ఆలోచనలో ఉన్నారు.

రోజుకి 2వేల మందికి భోజనం

ఆదినారాయణ తన తండ్రి సుంకర వెంకటసుబ్బయ్య పేరుతో ఎస్‌విఎస్ ట్రస్టు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది మార్చి 16న అప్పటి కలెక్టర్ కె.రాంగోపాల్ భోజనశాలను ప్రారంభించారు. ఏప్రిల్ ఆరు నుంచి రు15లకే భోజనం అమలవుతోంది. నెల్లూరు, బుచ్చిరెడ్డిపాలెం ప్రాంతాల్లో ప్రస్తుతం రెండువేలమందికి పోషక విలువలు కలిగిన భోజనం పెడుతున్నారు. నెల్లూరు నగరంలోని సిపిఎం సెంటర్ బాలాజీ నగర్‌లో మంచి సదుపాయాలతో భోజనకేంద్రం ఏర్పాటుచేశారు. మధ్యాహ్నం 12 గంటల నుండి ఇక్కడ భోజనం సిద్ధమౌతుంది. మధ్యాహ్నం 3 గంటల వరకు నిరాటంకంగా సాగుతుంది. వివిధ ప్రాంతాల నుండి వచ్చే కార్మికులు, సామాన్య, మధ్యతరగతి ప్రజలు, గ్రామీణప్రాంతాల నుండి వచ్చేవారు సైతం ఇక్కడ భోజనం చేస్తారు. కేవలం రు.15కు భోజనం, రు.25కు చికెన్ భోజనం అందిస్తున్నారు. ఇందులో పోషక విలువలు ఉండేలా చూస్తారు. ఒక్కో వ్యక్తికి 480 గ్రాముల భోజనం అందిస్తారు. సాంబార్‌లో 20 గ్రాముల పప్పులు, పచ్చడిలో 5 గ్రాముల మినుములు, ఆకుకూరలు, దుంపకూరలతో పోషకాలుండే విధంగా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దామరమడుగులోని

నిరాటంకంగా కొనసాగుతుంది...

నిరుపేదలకు పౌష్టికాహారం అందించాలనే ఓ మంచి ఆశయంతో ఏర్పాటు చేసిన ఎస్‌విఎస్ ట్రస్టు భవిష్యత్తులో కూడా ఎలాంటి ఆటంకాలు లేకుండా జరిగేలా ఏర్పాట్లు చేశా. 9 మంది సంకల్పం కలిగిన సభ్యులతో ట్రస్టు ఏర్పాటైంది. ప్రస్తుతం ట్రస్టుకు ఎలాంటి ఆస్తులూ లేకపోయినా నా తదనంతరం పొలం, భవనం, రైస్‌మిల్లు ట్రస్టుకు ఇచ్చి దానిని నిరాటంకంగా జరపాలన్నది నా ఆశయం. పిల్లలు మంచి వయస్సులో ఉన్నప్పుడు మంచి ఆహారం తీసుకుంటేనే దేశానికి మంచి పౌరులుగా తయారవుతారు. నానాటికి పెరిగిపోతున్న ధరల వల్ల కడుపు నింపుకోవడానికి తప్ప పౌష్టికాహారం తీసుకోడానికి లేకుండా పోతోంది. ఫలితంగా భవిష్యత్‌లో చాలా ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. అందుకే దీనిని ఒక యజ్ఞంలాగా నిర్వహిస్తున్నాను. భార్యాపిల్లల సహకారంతోపాటు శ్రేయోభిలాషులు, మిత్రులు కూడా ఇందుకు తోడ్పాటునిస్తున్నారు. ఎలాంటి ఆదాయం లేకుండా అలాగని నష్టపోకుండా రు.15 భోజన పథకం అమలవుతోంది. ధరలు ఎలా ఉన్నా నాలుగేళ్లపాటు ఈ రేటుతోనే భోజనం పెడ్తాం. ఒక వేళ ధరలు తగ్గితే భోజనం ధర కూడా తగ్గిస్తాం.

- సుంకర ఆదినారాయణ, ఎస్‌విఎస్ ట్రస్టు చైర్మన్.

ఎస్‌విఎస్ ట్రస్టు భవనంలో వంటకాలు ప్రారంభమవుతాయి. ముందు రోజే వంటకాల మెనూ తయారు చేసుకుంటారు. సరిగ్గా 11.30 గంటలకు వంట తయారవుతుంది. 12 గంటలకు నెల్లూరు చేరుకుంటుంది. ఆదినారాయణ దగ్గరుండి వంటలను పర్యవేక్షిస్తారు. 12 మంది కార్మికులు వంటలో పాల్గొంటారు. వారు నివాసాలుండేందుకు అక్కడే షెడ్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 15 రూపాయలకు భోజనం పెడుతున్నారు. అందులో నాలుగు కూరలు వడ్డిస్తున్నారు. అదే డబ్బులో వడ పెట్టేందుకు కూడా ప్రయత్నిస్తున్నారు. అందులోనూ పోషకాహారం ఉండేలా చూస్తున్నారు. సజ్జ, మినుము, సగ్గుబియ్యం, ఏది ఆ ధరకు వస్తుందో దాన్ని పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. 15 రూపాయల భోజన పథకాన్ని కూడా ఆదాయం లేకపోయినా నష్టం లేకుండా నడిపేందుకు ప్రయత్నం చేస్తున్నారు. నెల్లూరు నగరంలో రోజూ 600 భోజనాలు పెడుతుండగా బుచ్చిరెడ్డిపాలెంలో రెండొందలు భోజనాలు పెడుతున్నారు. ఒక్కోరోజు మరో వెయ్యి 1200 భోజనాలు పేదల ఫంక్షన్లకు పంపిస్తున్నారు. ఇంట్లో శుభకార్యాలున్నప్పుడు పేదలు, పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చు చేయలేని వారు ఇక్కడి రు.15 భోజనానికి ఆర్డర్ ఇచ్చి తీసుకెళుతున్నారు.



రోజుకు 10 వేల మందికి పెట్టాలి!

ప్రస్తుతం రెండు వేల మందికి సాగుతున్న 15 రూపాయల భోజన పథకాన్ని భవిష్యత్‌లో రోజుకు పది వేల మందికి పెట్టడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రస్తుతానికి ఐదు వేల మందికి వంటలు చేయడానికి అవసరమైన యంత్రాలను ఇక్కడ సమకూర్చారు. తను అనుకున్న లక్ష్యాన్ని చేరడానికి ఆదినారాయణ ఒక యజ్ఞం లాగా పనిచేస్తున్నారు. నెల్లూరు నగరంలో ప్రస్తుతం బాలాజీనగర్‌లో ఉండగా త్వరలో అయ్యప్పగుడి వద్ద ఆటో నగర్‌లో ఏర్పాటు చేయడానికి చకచకా పనులు జరుగుతున్నాయి. అక్కడి చికెన్ భోజనం 30 రూపాయలకు పెట్టాలని చూస్తున్నాం. అలాగే సేల్స్ గరల్స్, బోయిస్ అత్యధికంగా ఉండే కనకమహల్ సెంటర్లో ఒకటి ఏర్పాటు చేయాలనే ఆలోచనలు ఉన్నాయి. ఇలాగే జిల్లా వ్యాపితంగా విస్తరించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అయితే మహిళలు దుకాణాల నుంచి భోజన కేంద్రానికి రాకపోతుండడంతో వారి సౌకర్యార్థం క్యారియర్లను పంపిణీ చేసే పద్ధతిని ప్రవేశపెట్టనున్నారు. ఇందు కోసం 600 క్యారియర్లు కొనుగోలు చేశారు. ఒక్కో క్యారియర్‌లోని భోజనం ఆరుగురికి సరిపోతుంది. షాపు యజమానులను సంప్రదించి వారి ద్వారానే సేల్స్ గర్ల్స్‌కు భోజనాలు పంపే పద్ధతిని ప్రారంభించారు. అలాగే రూ25కే చికెన్ భోజనం పెడుతున్నారు. నెల్లూరు, చుట్టుపక్కల ప్రాంతాల్లో పేదలు ఏ శుభ కార్యం చేసుకున్నా తక్కువ ఖర్చుతో భోజనాలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మరో వైపు దీనిని ఉచిత భోజనంగా మార్చాలనే ఆలోచన కూడా ఉంది. రెండుమూడొందల మంది ఎన్నారైలను ఎంపిక చేసుకొని వారి నుంచి ఏడాదికి కొంత నిధులు తీసుకొని నిరుపేదల వాడల్లో పేదలకు పౌష్టికాహారం అందించాలని చూస్తున్నారు. ఇది కార్యరూపం దాల్చితే ఆయన సంకల్పం నెరవేరుతుంది. అలాగే సాయంత్రం వేళల్లో కేవలం ఏడు రూపాయలకే అల్పాహారం ఇవ్వడానికి ట్రస్టు ఆలోచన చేస్తోంది. వచ్చే ఏడాది దీనిని అమలు చేయనున్నారు. వంద గ్రాముల పండ్లు, జొన్న రవ్వ, పెసలు, మినపప్పు, కూరగాయలతో కలిసి రవ్వ ఇడ్లీ ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 150 నుంచి 200 గ్రాముల్లో పప్పు, తృణ ధాన్యాలు ఇవ్వాలని ఆలోచన చేస్తున్నారు.

★

క్యారియర్ తెచ్చుకోవడం మానేశా

నేను ఇక్కడ ఓ బంగారు దుకాణంలో పనిచేస్తున్నా. నెలకు ఐదు వేల రూపాయల జీతమిస్తారు. 30 కిలో మీటర్ల దూరంలో ఉన్న అల్లూరు నుంచి ఇక్కడకొస్తాను. ఉదయం 6.30 గంటలకు లేచి ఇంట్లో ఉన్న దాన్నే తీసుకొచ్చి మధ్యాహ్నం కడుపు నింపుకునేవాణ్ణి. ఒక్కో సారి చద్దన్నం కూడా తెచ్చుకునేవాడిని. ఎప్పుడైతే 15 రూపాయల భోజనం పెడుతున్నారని తెలుసుకున్నానో అప్పటి నుంచి క్యారియర్ తేవడం మానేశా. నెల్లూరులో ఫుల్ భోజనం 50, ప్లేట్ మీల్స్ 30 రూపాయలు. ఇలాంటి సమయంలో రు.15కే భోజనం పెట్టి ఆకలి తీరుస్తున్నారు.

జి.సురేష్, సేల్స్‌మాన్

నేనెక్కడా చూడలేదు

నేను కంపెనీ పనులపై ఐదు జిల్లాల్లో తిరుగుతున్నా. ఇలాంటి భోజనశాలను ఎక్కడా చూడలేదు. కేవలం 15 రూపాయలకు కనీసం సాదా దోశ వచ్చే పరిస్థితి లేదు. నాలుగు రకాల కూరలు, మజ్జిగతో ఇలాంటి భోజనం పెట్టాలంటే గొప్ప ఆశయం ఉండాలి. నిజంగా ఇది ఆదర్శం. ఇది బాగా జరగాలని కోరుకుంటున్నా.

సురేంద్రనాథ్, సేల్స్ ప్రమోటర్

కథ

నల్ల కలువ

-ఆర్. శాంతసుందరి

బురదగుంటలోంచి పైకి పొడుచుకొచ్చిన ఆ పిల్ల తల వాళ్లకి కనిపించింది. కళ్లు పూర్తిగా తెరిచిఉన్నాయి. పెదవులు కదులుతున్నాయి. కానీ ఏమీ బైటికి వినపడటంలేదు. ఆ శ్మశానం లాంటి ఆవరణంలో చావు వాసన దూర తీరాలనుంచి రాబందులను ఆకర్షిస్తోంది. అనాథల వాతావరణంలో ఆ చిన్నారి హాహాకారాలూ గాలిలో నిండిపోయాయి. అలాంటి వాతావరణంలో ఆ చిన్నారి ప్రాణాలను ఉగ్గబట్టుకుని ఇంకా బతికి ఉండటమే ఒక విషాదంలా తోస్తోంది. టెలివిజన్ కెమెరాలు ఆ భయంకరమైన దృశ్యాన్ని పదే పదే ప్రసారం చేస్తున్నాయి. ఆ పిల్ల తల బురదలోంచి విచ్చుకున్న నల్ల కలువలా ఉంది. ఆమెని గుర్తుపట్టేవాళ్లు అక్కడ ఎవరూ లేరు.

భూగర్భ శాస్త్రవేత్తలు, అగ్నిపర్వతం బద్దలైనప్పుడు బయల్పడిన వేడి వల్ల పర్వత శిఖరం మీద ఉన్న మంచు కిందికి జారే ప్రమాదముందని కొంతకాలం క్రితమే హెచ్చరించారు. కానీ దానిని ఎవరూ పట్టించుకోలేదు. భూమి మూలుగుతున్నా వినిపించుకోకుండా కొలంబియా పర్వతప్రాంతంలోని ఊరి జనం తమ పనుల్లో తామిుండిపోయారు. 1985వ సంవత్సరం నవంబరు రాత్రి ఒక పెద్ద గర్జన చాలాసేపు వినిపించింది... ప్రపంచం అంతం కాబోతోందని ప్రకటించినట్టు బ్రహ్మాండమైన మంచు గోడలు విరిగి పడ్డాయి. అవి రాళ్లతోనూ బంకమట్టితోనూ కలిసి దొర్లుకుంటూ ఊళ్లమీద పడి వాటిని కప్పేశాయి. ఆ భీభత్సం నించి బతికి బైటపడ్డవాళ్లు, ఊళ్లకి ఊళ్లు మాయమయ్యాయనీ, తమ వాళ్లు

ప్రేమ అంటే ఏమిటో తెలియకుండా, ప్రేమని చవిచూడకుండా ఎవరైనా ఈ లోకం వదిలి వెళ్లటం ఎంత బాధాకరం!" అని అంటుంటే లిల్లీ గొంతు వణికింది. రాల్ఫ్ ముందుకు వంగి లిల్లీ నుదుటిని సుతారంగా ముద్దు పెట్టుకున్నాడు.

రాల్ఫ్ అలా చేసేసరికి లిల్లీ లేద హృదయంలో ఏదో తెలియని నమ్మకం గూడు కట్టుకుని మనసు కుదుట పడింది. మొహంలో ఒక తృప్తి, ఒక ప్రశాంతత కనిపించింది. ఇక తనకి ఏమైనా పరవాలేదన్న ధీమాతో కళ్లు మూసుకుంది.

చాలామంది మట్టిలో కలిసిపోయారనీ తెలుసుకున్నారు.. చాలాసేపటి తరవాత ఆర్మీ వాళ్లూ, వాలంటీర్లూ వచ్చి ఇరవైవేల కన్న ఎక్కువమంది ఆ బురదలో కూరుకుపోయారనీ, లెక్కలేనన్ని జంతువుల కళేబరాలు కూడా కొట్టుకొచ్చాయనీ తేల్చారు.

టీవీ రిపోర్టర్ రాల్ఫ్ ప్రమాదం జరిగిన స్థలానికి చేరుకుని ఆ పిల్లతో మాట్లాడడం మొదలుపెట్టాడు. అతని కెమెరా ఆ పిల్ల మీదికి జూమ్ అయి ఉంది. నల్లటి మొహం, అసహాయంగా చూస్తున్న పెద్ద పెద్ద కళ్లూ, అస్తవ్యస్తంగా చెదిరిన జుట్టూ. ఆమె చుట్టూ పరుచుకున్న బురద.. ఆమె దగ్గరకి వెళ్లాలని ఎవరైనా ప్రయత్నిస్తే వాళ్లే మునిగిపోయే ప్రమాదం ఉంది. రాల్ఫ్ ఆ పిల్లవైపుకి ఒక తాడు విసిరాడు. కానీ అతను అరిచి చెప్పేదాకా లిల్లీ దాన్ని అందుకునే ప్రయత్నమే చెయ్యలేదు. బురదలోంచి తన చేతిని బైటికి తియ్యబోయింది. కానీ ఆ చిన్నపాటి కదలికకే మరి కొంచెం లోపలికి కూరుకుపోయింది.

రాల్ఫ్ ఆ బురదలోకి కొంతదూరం ఈదాడు. "నీ పేరేంటి?" అని అడిగాడు.

ఆ పిల్ల తన పేరు చెప్పింది.

"లిల్లీ, కదలకు... అక్కడే ఉండు" అంటూ రాల్ఫ్ ఆ అమ్మాయి వైపు నెమ్మదిగా కదలసాగాడు. బురద అతని నడుంవరకూ వచ్చేసింది. అక్కడ గాలి కూడా బురదలాగే కంపుకొడుతోంది. కాళ్ళూనటానికి గట్టి నేలకోసం వెతుక్కుంటూ ఒక చోటికి చేరుకున్నాడు. తన దగ్గరున్న తాడుని లిల్లీ చంకలకింద గట్టిగా కట్టాడు. అలా కడితే ఆమెని బైటికి లాగటం వీలవుతుందని అనుకున్నాడు.

రాల్ఫ్ లిల్లీకేసి చూసి చిరునవ్వు నవ్వి ఇంకేమీ భయంలేదని చెప్పాడు. మిగతా వాళ్లకి ఆ పిల్లని బైటికి లాగమని సైగ చెసాడు. కానీ తాడుని లాగగానే అది లిల్లీ ఛాతీ చుట్టూ బిగుసుకుంది. ఆ పిల్ల కెవ్వుమని అరిచింది. లిల్లీ భుజాలూ, చేతులూ పైకి లేచాయి. కానీ ఆ తరువాత ఎంత లాగినా ఒక్క అంగుళం కూడా కదల్చలేకపోయారు. ఆ పిల్ల కాళ్లు ఎందులోనో ఇరుక్కుపోయాయి. ధ్వంసమైన భవనాల గోడల మధ్య ఆమె కాళ్లు ఇరుక్కుపోయాయేమోనని ఎవరో అన్నారు. కానీ, చనిపోయిన తన అన్నలూ అక్కలూ తన కాళ్లకి చుట్టుకుని ఉండిపోయారని లిల్లీ అంది.

"ఏం భయం లేదు లిల్లీ! మేం నిన్ను ఎలాగో ఒకలా బైటికి తీస్తాం... ప్రామిస్" అన్నాడు రాల్ఫ్. లిల్లీ అతనివైపు చూసింది కానీ ఏం మాట్లాడలేదు.

కొన్ని గంటలపాటు రాల్ఫ్ తాను చెయ్యగల ప్రయత్నాలన్నీ చేశాడు. పొడుగాటి కర్రలూ, తాళ్లూ ఉపయోగించి లిల్లీని రక్షించాలని చూశాడు. కానీ అక్కడ చిక్కుకుపోయిన ఆమెకి అవి చిత్రహింసలుగా మారాయి. అక్కడ ఉన్న ఆర్మీ వాళ్ల వల్ల కూడా పని జరగలేదు. లిల్లీ అస్సలు కదల్లేని స్థితికి చేరుకుంది. ఊపిరి తీసుకోవటం కూడా కష్టమనిపించింది. కానీ రాల్ఫ్ ఆమెని ఎలాగైనా మృత్యువాత పడకుండా కాపాడాలని నిర్ణయించుకున్నాడు. బురదలో మునిగి లిల్లీ కాళ్లని విడిపించాలని చూశాడు. కానీ బురద కింద రాళ్ళూ రప్పలూ అతని చేతులకీ కాళ్లకీ అడ్డంపడి ముందుకి కదలనివ్వలేదు. అతని నోట్లోకి బురద వెళ్లింది.

ఉమ్ముతూ బైటికి వచ్చేశాడు. ఆ బురదలోని నీళ్లని పంప్ చేసి బైటికి పారబోయించాలని అనుకుని దానికోసం ట్రాన్స్మిటర్‌లో మెసేజ్ పంపాడు. అది పంపేందుకు వాహనం ఏదీ లేదనీ ఉదయం దాకా ఆగాలనీ జవాబు వచ్చింది.

"అంతదాకా ఆగటం కుదరదు!" అంటూ అరిచాడు రాల్ఫ్.

కానీ అక్కడున్న గందరగోళంలో అతని మాటలు ఎవరూ వినిపించుకోలేదు.

ఆర్మీ డాక్టర్ వచ్చి లిల్లీని పరీక్షించి, పొద్దున్న దాకా ప్రాణభయం లేదని చెప్పి వెళ్లిపోయాడు.

"కాస్త ఓర్చుకోవాలి లిల్లీ! రేపు పంప్ వస్తుంది, నిన్ను బైటికి తీస్తాం" అన్నాడు రాల్ఫ్ ధైర్యం చెపుతూ.

'నన్నిక్కడ ఒంటరిగా వదిలేసి వెళ్లరు కదూ?" అందా అమ్మాయి దీనంగా.

"లేదు లిల్లీ, నేనెక్కడికీ వెళ్లటంలేదు!" అన్నాడు రాల్ఫ్.

కొన్ని గంటలపాటు రాల్ఫ్ తాను చెయ్యగల ప్రయత్నాలన్నీ చేశాడు. పొడుగాటి కర్రలూ, తాళ్లూ ఉపయోగించి లిల్లీని రక్షించాలని చూశాడు. కానీ అక్కడ చిక్కుకుపోయిన ఆమెకి అవి చిత్రహింసలుగా మారాయి. అక్కడ ఉన్న ఆర్మీ వాళ్ల వల్ల కూడా పని జరగలేదు. లిల్లీ అస్సలు కదల్లేని స్థితికి చేరుకుంది. ఊపిరి తీసుకోవటం కూడా కష్టమనిపించింది. కానీ రాల్ఫ్ ఆమెని ఎలాగైనా మృత్యువాత పడకుండా కాపాడాలని నిర్ణయించుకున్నాడు.

ఇంతలో ఎవరో కాఫీ తెచ్చారు. వేడి వేడి కాఫీ తాగాక ఆ పిల్లకి కొంచెం ప్రాణం వచ్చినట్టనిపించింది. తన చిన్న జీవితం గురించి చెప్పసాగింది. తన కుటుంబం, స్కూలూ, అగ్నిపర్వతం బద్దలు కాకముందు తమ ఊరు ఎలా ఉండేదో.. చెప్పింది. తనకి పదమూడేళ్లనీ, ఎప్పుడూ ఊరు విడిచి ఎక్కడికీ వెళ్లనే లేదనీ అంది. రాల్ఫ్ వార్తా ప్రపంచంలో తన అనుభవాలని ఆపిల్లకి సమయం గడపడానికని చెప్పాడు. వాస్తవాలు చెప్పటం అయిపోయాక, ఆ పిల్లకి వినోదం అందించే ఉద్దేశంతో ఏవేవో కల్పించి చెప్పసాగాడు. మధ్య మధ్యలో ఆ పిల్ల కునికి పాట్లు పడసాగింది, అయినా తను ఆ చీకట్లో అక్కడే ఉన్నానని తెలియజేయడం కోసం అతనలా మాట్లాడుతూనే ఉన్నాడు. ఏం జరగబోతోందో తెలీని ఆ స్థితిలో అతను కూడా ఏమీ ఆలోచించకుండా ఉండేందుకు అలా మాట్లాడటం పనికివచ్చింది. అది ఒక సుదీర్ఘమైన రాత్రిగా అనిపించింది.

లిల్లీ వణకటం మొదలు పెట్టింది. కదలకుండా ఉండిపోవటం వల్లా, నీరసం వల్లా ఆ పిల్ల చాలా డీలా పడిపోయింది. కానీ స్పృహ కోల్పోలేదు. పొద్దువాలే వేళకి సన్నటి జల్లు మొదలయింది.

"ఆకాశం ఏడుస్తోంది!" అంది లిల్లీ తనొకపక్క ఏడుస్తూనే.

"భయపడకు. గాభరా పడితే మరింత నీరసం వస్తుంది. పంపు వస్తుంది, రాగానే నువ్వు బయటపడేలా చూస్తాం" అన్నాడు రాల్ఫ్. కానీ పంపు అక్కడికింకా చేరలేదు.

మర్నాడు మళ్లీ చీకటిపడింది. రాల్ఫ్ వాళ్లమ్మ దగ్గర నేర్చుకున్న ఒక జోలపాట పాడసాగాడు. కానీ లిల్లీకి నిద్ర రావటంలేదు.

రాల్ఫ్‌కి తన పాత రోజులు గుర్తుకొచ్చాయి. తన తండ్రి ఆవిడను పెట్టిన రకరకాల బాధలూ, తనని క్రూరంగా హింసించటం.. అతని కళ్ళు చెమ్మగిల్లాయ్.

అతను ఏడవటం చూసి లిల్లీ, "మీరు ఏడవకండి.. నాకిప్పుడు నొప్పిలేదు!" అంది.

"నేను నీ కోసం కాదు లిల్లీ, నా కోసం ఏడుస్తున్నాను," అన్నాడు రాల్ఫ్.

మూడో రోజు తెల్లారేసరికి ఆకాశం తుఫాను మబ్బులతో నిండిపోయింది.. చక్కటి సఫారీ సూట్‌లో ఆ దేశాధ్యక్షుడు అక్కడి పరిస్థితి చూసేందుకు వచ్చాడు. ఇది ఈ శతాబ్దంలోకల్లా ఘోరమైన సంఘటన అనీ, మొత్తం దేశమంతా విషాదంలో కూరుకుపోయి ఉందనీ ఆ ప్రాంతం మొత్తం పవిత్రమైన ప్రదేశంగా ప్రకటించాననీ, ఫాదరీలు మృతుల ఆత్మశాంతికై సామూహిక ప్రార్థనలను జరుపుతారనీ ఉపన్యసించాక, చివరగా లిల్లీ అంత ధైర్యంగా ఉన్నందుకు పొగిడి వెళ్లి పోబోతుండగా, రాల్ఫ్ ఆయన్ని పంప్ సంగతి అడిగాడు. తను వెళ్లి పంప్ పంపే ఏర్పాట్లు చూస్తానని హామీ ఇచ్చి ఆయన వెళ్లిపోయాడు.

మళ్లీ వాళ్లిద్దరే మిగిలారు. లిల్లీ తనకి ఇంతవరకూ ఒక్క బాయ్ ఫ్రెండ్ కూడా లేడని చెప్పింది.

"ఇప్పుడు నేను ఉన్నానుగా?" అన్నాడు రాల్ఫ్. లిల్లీ కళ్లు మెరిసాయి.

"ఔను. నిజం ఇప్పటివరకు నాకు కూడా ఎవరూ లేరు.. కాని

ఇకనుంచి నాకు నువ్వు, నీకు నేను..' అన్నాడు. రాల్ఫ్.

ప్రేమ అంటే ఏమిటో తెలియకుండా, ప్రేమని చవిచూడకుండా ఎవరైనా ఈ లోకం వదిలి వెళ్లటం ఎంత బాధాకరం!" అని అంటుంటే లిల్లీ గొంతు వణికింది. రాల్ఫ్ ముందుకు వంగి లిల్లీ నుదుటిని సుతారంగా ముద్దు పెట్టుకున్నాడు.

రాల్ఫ్ అలా చేసేసరికి లిల్లీ లేత హృదయంలో ఏదో తెలియని నమ్మకం గూడు కట్టుకుని మనసు కుదుట పడింది. మొహంలో ఒక తృప్తి, ఒక ప్రశాంతత కనిపించింది. ఇక తనకి ఏమైనా పరవాలేదన్న ధీమాతో కళ్లు మూసుకుంది.

రాల్ఫ్ మనసులోనే లిల్లీ త్వరగా, ఎక్కువ బాధ పడకుండా చనిపోవాలని ప్రార్థించాడు, ఎందుకంటే మట్టిలో మెడ వరకు కూరుకుపోయి ముప్పైఆరు గంటలకు పైగా ఆమె అనుభవిస్తున్న చిత్రహింస భరింపశక్యం కానిదని అతనికి తెలుసు.

విధి అతని కోరికని మన్నించింది. ఆ మూడో రోజు రాత్రి, క్వార్ట్జ్ లైట్ల వెలుగులో, కెమెరాలు ఆమె మీద ఫోకస్ అయి ఉండగా, లిల్లీ తన చివరి క్షణం వరకూ తోడున్న రాల్ఫ్ కళ్లల్లోకి చూస్తూ, ప్రాణాలు విడిచింది. రాల్ఫ్ ఆమెని తన గుండెలకి హత్తుకుని, వదిలేశాడు. లిల్లీ నెమ్మదిగా బురదలోకి మునిగిపోయింది.. బురదలో ఒక కలువపూవులా...! ★

మీరు ఏ పని చేస్తున్నా బోర్‌గా వుంటోందా! ఊరకే అలసిపోతున్నారా! కారణాలు తెలిస్తే ఈ ఇబ్బందుల నుండి సులువుగా బయటపడగల్గుతారు. కానీ చేసే పనిమీద శ్రద్ధ తగ్గుతోందని, సులువుగా అలసిపోతున్నామని చెప్పేవారు మనకు కన్పిస్తూ ఉంటారు. అసలు ఎందుకు అలసిపోతాం? కారణాలేంటి? ఈ విషయంలో ఆహారం పాత్ర ఏంటి? అలసిపోకుండా వుండేందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

ఊరకే అలసిపోతున్నారా?

– సి.వి. సర్వేశ్వరశర్మ
ఫోన్ నెం: 9866843982
sarma.chavali@gmail.com

మహిళలు ఇంటి పనులను ఎంతగానో కష్టపడి పూర్తి చేసుకుంటారు. అలసిపోతున్నా పట్టించుకోరు. శుభ్రంగా, ఆకర్షణీయంగా ఉండేందుకు కావలసిన జాగ్రత్తలు తీసుకోలేక ఆ అలసిన ముఖంతో ఉండిపోతుంటారు. ఆఫీసు పనితో, ఇంటి పనితో అలసిపోవడం సర్వ సాధారణం. కాని మనిషి సులువుగా మాటిమాటికి అలసిపోతే ఎలా? ఇలా అలసిపోవడానికి రక్తహీనత, పౌష్టికాహారలోపం ప్రధాన కారణాలు. ఆడవారిలో ఈ అలసటకు కారణం రక్తహీనత. చాలా మందికి రుతుస్రావం భారీగా కావడం వల్ల రక్తహీనత సమస్య తలెత్తుతుంది. పైగా చాలా మంది తగినంత పౌష్టికాహారం తీసుకోరు.

ఆహారలోపం

ఆరోగ్యం బాగుండాలంటే కొన్ని కనీస క్యాలరీల ఆహారం తినాలి. శారీరక శ్రమ చేసేవారికి, గర్భిణీస్త్రీలకు, పాలిచ్చే తల్లులకు ఎక్కువ క్యాలరీల ఆహారం అవసరం అవుతుంది. క్యాలరీలు ఎక్కువగల ఆహారం సమీకృత ఆహారం అయి ఉండాలి. అంటే తినే తిండిలో చాలినంత కార్బోహైడ్రేట్లు, ప్రొటీన్లు, కొవ్వు పదార్థాలు, విటమిన్లు, ఖనిజాలు ఉండాలి. కొంతమంది నాజూగ్గా ఉండాలనే ప్రయత్నంలో తిండి తగ్గించేసుకుంటారు. దీనివల్ల శరీరంలో మెటబాలిక్ చర్యల్లో మార్పులు సంభవిస్తాయి. ఇటువంటి వారు సులువుగా అలసిపోతూ ఉంటారు. తినే ఆహారంలో ప్రొటీన్లు, పండ్లు, తాజాకూరలు తగ్గితే ఆహార లోపం వస్తుంది. పౌష్టికాహారం తినడం అలవరచుకోవాలి. అనవసరపు తిళ్లు తిని స్థూలకాయం పెంచుకోకూడదు. రక్తహీనత అనేది ఆహారం సరిగా తీసుకోక పోవడం వలన మాత్రమేగాక, రక్తం నష్టపోవడం, పైల్స్, స్త్రీలలో రుతుస్రావం సక్రమంగా లేకపోవడంవల్ల కూడా రావచ్చు. వరమ్ ఇన్‌ఫెక్షన్ వల్ల కూడా తలెత్తవచ్చు. దీర్ఘవ్యాధులయిన డయబెటిస్, క్యాన్సర్, థైరాయిడ్ గ్రంథి సరిగా పనిచేయక పోవడం, గుండె జబ్బులు వల్ల కూడా త్వరగా అలసిపోవచ్చు. సాయంత్రం శరీర ఉష్ణోగ్రత పెరగడం, బద్ధకం, రాత్రి చెమట పట్టడం, వంటి లక్షణాలు శరీరంలో కొన్ని రకాల ఇన్‌ఫెక్షన్లను సూచిస్తాయి.

మానసిక కారణాలు

కొన్ని మానసిక పరిస్థితుల కారణంగా త్వరగా అలసిపోతుంటారు. ఈ కారణాలను సాధారణంగా పట్టించుకోరు. కొంతమందికి పని గంటలు ఒక నియమం ప్రకారం ఉండక క్రమరహితంగా ఉంటాయి. ఇటువంటి వారికి విశ్రాంతి, తగినంత నిద్ర ఉండదు. ఫలితంగా నిద్రలేవగానే అలసినట్లు ఉంటుంది. ఎక్కువగా పనిచేయాల్సి రావడం, ఇందులో ఏ మాత్రం విశ్రాంతి తీసుకునే అవకాశం లేకపోవడం వల్ల కూడా త్వరగా అలసిపోతాం. ఆందోళన కూడా అలసటకు కారణమౌతుంది. ఇష్టం లేకపోయినా పని చేయాల్సి వచ్చినపుడు, ఒత్తిడితో పని చేసినపుడు త్వరగా అలసిపోతారు. ఇలాంటి సమయంలో శరీరంలోని శక్తి పూర్తిగా పని సమయంలో హరించుకు పోతుంది. బోర్‌గా ఉండడం వల్ల కూడా అలసట వస్తుంది. ఇటువంటి స్థితి హానికరంగా తయారవుతుంది. సరైన ఉద్యోగం, లక్ష్యాలు లేనివారు సులువుగా బోర్ ఫీలవుతూ ఉంటారు. ఒకేపని పదే పదే చేయడం కూడా బోర్‌గా తయారయి త్వరగా అలసిపోతూ ఉంటారు.

వ్యాయామం

వ్యాయామం చేయడంవల్ల శరీరానికి శక్తి, ఆరోగ్యం సమకూరుతాయని కొంతమంది నమ్మకం. మోతాదులో వ్యాయామం చేయడం శరీరానికి మంచిదే. మితిమీరి వ్యాయామం చేస్తే మనిషి అలసిపోవడంతోపాటు శరీరంలో ఉన్న శక్తి ఖర్చు అయిపోవడం జరుగుతుంది. అంటే మనిషి అలసిపోయే విధంగా వ్యాయామం చేయకూడదు.

క్రానిక్ ఫెటీగ్ సిండ్రోమ్

ఇటీవల కాలంలో కొత్తరకం రోగం మనుషుల్లో మొదలయ్యింది. దీని లక్షణాలు ఎలా ఉంటాయంటే అలసటకు తోడుగా, కొద్దిగా జ్వరం, కండరాల బలహీనత, అంతులేని నీరసం, తలనొప్పి, కీళ్లనొప్పులు, తికమక పడుతూ ఉండడం, జ్ఞాపకశక్తి తగ్గుదల, చూపు మందగించడం, నిద్ర సరిగా పట్టకపోవడం వంటి లక్షణాలు ఉంటున్నాయి. దీనిని ఒక మానసిక రుగ్మతగా వైద్యులు మొదట్లో భావించారు. చాలా మంది ఈ రోగంతో చాలా బాధ పడేవారు. ఎందుకంటే వైద్యులకు తెలిసిన రోగాల జాబితాలో ఈ లక్షణాలు గల రోగం లేకపోవడమే. ఆ తరువాత వైద్యులు ఈ రోగాన్ని 'క్రానిక్ ఫెటీగ్ సిండ్రోమ్'గా పేరు పెట్టారు. శరీరంలోని రోగ నిరోధక శక్తి తగ్గి వైరస్ శరీరంలో ప్రవేశించి తెలియని రసాయనిక హాని చేస్తున్నట్లు గుర్తించారు. సులువుగా అలసిపోయే ఈ చికాకు నుండి బయట పడడం ఎలా? ముందుగా టిబి, షుగర్, క్యాన్సర్, నిల్వ ఇన్‌ఫెక్షన్స్, గతి తప్పిన ఋతుక్రమం, రక్తం నష్టపోవడం వంటి రోగాలు ఏమైనా వున్నాయా? చూసుకోవాలి. ఏ రోగం లేనివారు అలసిపోతుంటే వారు చేయాల్సిన పనులు ఏమిటో తెలుసుకుందాం.

మార్గదర్శకాలు

చాలినంత పౌష్టికాహారం తీసుకోవాలి. అనవసరపు తిళ్లు తినకూడదు. పాలు, గుడ్లు, తాజాకూరలు, పళ్ల వంటి వాటితో సమీకృత ఆహారం భుజించాలి. అవసరం అయితే 'బి విటమిన్' విడిగా తీసుకోవాలి. బోర్‌గా చేసే పని ఉంటే మీకు ఇష్టం లేదా సరదా అన్పించే పనులు చేపట్టి బిజీగా ఉండేటట్లు చూసుకోవాలి. ఆందోళన, డిప్రెషన్, ఒత్తిడి కల్గించే పరిస్థితులతో పోరాడాలి. అవసరమైతే మానసిక వైద్యుని సహాయం తీసుకోవాలి. జీవితంలో అనుకూల దృక్పథం అలవరచుకోవాలి. మనం ప్రపంచాన్ని మార్చలేము. మనకు బాధ కల్గించే విషయాలను మనం మౌనంగా అంగీకరించాల్సి ఉంటుంది. నిరంతరం పనిచేయకూడదు. పని సమయంలో చిన్న చిన్న బ్రేక్స్ తీసుకోవాలి. నిద్రా సమయాన్ని తప్పనిసరిగా నిద్రకు కేటాయించాలి. ఆల్కహాల్ వంటివి తీసుకోవడం మంచిది కాదు. ఇది కాలం గడిచే కొద్ది హాని చేస్తుంది. అలసట రావడానికి అనేక కారణాలు ఉంటాయి. రోగాల వల్ల అలసట వస్తుంటే వైద్యుని సలహామేర వాటిని అదుపులో ఉంచుకోవాలి. లేదా తగ్గించుకోవాలి. ఇహ మిగిలిన కారణాల వల్ల త్వరగా అలసిపోతుంటే... ఆహారం, జీవన విధానంలో చిన్న చిన్న సర్దుబాట్లు చేసుకోవాలి.

★

సినిమా 'ట్రిక్' కథలు



కథా సంపుటం పేరు "మరిగే తారు సరోవరం". 'సామాజిక విప్లవం కోసం కొత్తతరం కథలు' అనేది ఉప శీర్షిక. సామాజిక విప్లవం కోసం ఇందులో వెతికితే మనం పప్పులో కాలేసినట్లే. తెలుగు సినిమాల్లో వుండే సామాజిక విప్లవం ఇందులో కనబడుతుంది. ప్రతి కథలోను హీరోలు, హీరోయిన్లు వున్నారు. ప్రేమలు, దోపిడీలు, ఫైటింగులు వున్నాయి. ప్రస్తుతం సమాజంలో చోటుచేసుకున్న కొన్ని ఘటనల ఆధారంగా కథలల్లే ప్రయత్నం చేశారు రచయిత. మొత్తం పది కథలున్నా మరిగే తారు సరోవరం మనకు ఎక్కడా దొరకదు. 9వ కథలో హీరోయిన్ తండ్రి తన కూతురును ప్రేమించిన కారణాన హీరోను రోడ్డుపై ఈడ్చుకుంటూ వెళ్ళి మండుతున్న తారుడబ్బాలో హీరోను పడవేస్తాడు. దానికే మరిగే తారు సరోవరం పేరు పెట్టినట్లు మనం కష్టపడి అర్థం చేసుకోవాల్సిందే. రచయిత కథా సంవిధానం బాగుంది. మంచి శైలితో తను చెప్పదల్చుకున్న విషయాలను సూటిగా హత్తుకొనేలా చెప్పాడు. ప్రస్తుత సామాజిక పరిస్థితుల్లో రాజకీయాలు, డబ్బు, అవినీతి, నేరాలు ఎలా ముడివేసుకుపోయాయో రచయిత సమర్థవంతంగానే వివరించినా దానికి సినిమా ట్రిక్ పరిష్కారాన్నే ఎంచుకొన్నాడు. సామాజిక రుగ్మతలపై రచయిత తన ఆవేదనను వెళ్ళగక్కాడు. సామాజిక విప్లవంకోసం కొత్తతరం కథలంటూనే ఎక్కడా ప్రజల పాత్ర గురించి పట్టించుకోలేదు. "వీరులున్నారు" కథలోలాగా నిజాయితీపరులైన ఆఫీసర్లో, "సన్నజాజులు ఎగదోసిన నిప్పు"లోలాగా గొప్పింటివాళ్ళలో వుండే మానవతావాదులో, "పెదప్పరాయుడు" కథలోలాగా ఆస్తులను పేదలకు బదిలీ చేయటం ద్వారా సమాజాన్ని మార్చేస్తారని రచయిత చెప్పేశారు. దుర్మార్గులను బాంబులతో పేల్చివేయటం "జగన్నాథ రథచక్రాలు" ద్వారా ఉగ్రవాదాన్నీ ప్రోత్సహించారు. భారతదేశంలో (లోభుల్లో కర్ణుడు) మరీ తెలుగువారిలో (అమ్మీ) డబ్బున్న పెట్టుబడిదారులు లోభులని, పిల్లికి బిచ్చం పెట్టరని, దానధర్మాలు చేయరని వర్ణించడమే కాక, అమెరికన్ పెట్టుబడిదారులైన బిల్‌గేట్స్, వారెన్ బఫెట్‌లు దీన జనార్ధనకోసం ట్రస్టులు పెట్టి డబ్బు ఖర్చు పెడుతున్నారని రచయిత వివరించడంలో ఔచిత్యమేమీలేదు. ఏదేశంలో పెట్టుబడిదారులైనా పన్నులు ఎగవేయడానికి, లాభాల్లో కొంత భాగాన్ని ట్రస్టులకు తరలించడం మనకు తెలిసిందే. రచయితకు ఆమాత్రం కూడా అవగాహన లేదని అనుకోలేము."మనమింతే" కథద్వారా వృద్ధాప్యంలో ఉన్నవారి పట్ల కన్నబిడ్డల అమానుష ప్రవర్తనను, "పాతూరి పార్వతి" కథ ద్వారా మహిళా శక్తిని రచయిత వివరించారు. లోభుల్లో కర్ణుడు కథ ముగింపులో రచయిత చెప్పినదాన్నిబట్టి 2050 నాటికి భారతదేశం బాగుంటుంది. కారణం డబ్బున్న వాళ్ళలో మానవత్వం వచ్చి, దానధర్మాలు పెరిగి బీదసాదలను బాగా చూసుకొంటారు. ఆహా! భలే పరిష్కారం!! సమాజంలో అవినీతి పెరిగిపోతుందని, దోపిడీ దుర్మార్గాలు జరుగుతున్నాయని లక్షల కోట్ల జాతి సొమ్ము రహస్యంగా విదేశీ బ్యాంకుల్లో దాచుకొంటున్నారని చెప్పినంత మాత్రానే రచనకు సార్థకత రాదు. ఏ కారణంవల్ల ఇలా జరుగుతుంది? ఎవరు ఏ పాత్ర నిర్వహించడం ద్వారా దీన్ని పరిష్కారం సాధించవచ్చో అంతర్లీనంగానైనా చెప్పాల్సిన బాధ్యత రచయితలపై వుంది. అలా కాకుండా పరిస్థితి బాగాలేదని వివరించినంత మాత్రాన ఒరిగిపడేదేమీ లేదు.

మరిగే తారు సరోవరం-ఎస్. గణపతిరావు, వెల : రూ. 100/-

- కారుసాల

కొత్త పుస్తకాలు

జీవన ప్రతిబింబాలు

మనం గర్వించదగిన తెలుగు కథకుల్లో పెద్దిబొట్ల సుబ్బరామయ్య వుంటారు. ఆయన కథలు జనజీవన ప్రతిబింబాలు. పెద్దిబొట్ల సుబ్బరామయ్య కథలు రెండవ సంపుటంలో ముప్ఫయ్ కథలున్నాయి. ఇవి ముప్ఫయ్‌నలభై ఏళ్ల కిందటివి. అయినా ఇప్పటికీ పాఠకుడిని కదిలించగల అస్తిత్వంతో ఉన్నాయి. 'చిన్నమ్మ నవ్వింది'లో అవిటిపిల్ల సవతితల్లి పోరు తప్పించుకోవాలంటే ఎంతోకొంత సంపాదించాలి. అందుకే కథలో మాస్టారు ముందు మద్యం షాపు ముందు బఠాణీల దుకాణం పెట్టిస్తాడు. ఆ షాపు బందు అయ్యాక మళ్లీ సవతితల్లి పోరు. మాస్టారే ఈ మాటు మళ్లీ పూలు తెచ్చి మాలకట్టి అమ్మే దుకాణం పెట్టిస్తాడు. సమస్య తీరింది. ఆదుకునే మాస్టార్లు కావాలి అంతే! 'గాంధీని చూసినవాడు' కథలో డ్రాయింగ్ మాస్టారూ అంతే! విదేశం నుండి సొంత వూరికొచ్చిన అన్నాచెల్లెళ్లు దేశం స్థితిగతులను ఆడిపోసుకుంటుంటే ఈ దేశం తీరే అంత అంటూ చెబుతాడిలా "ఈ వ్యవస్థకు యాభైఏళ్ల వయస్సు వచ్చింది. ఇక ఇప్పుడే ప్రమాదమూ రాదు. బాలారిష్టాలన్నీ దాటాయనే అనుకోవచ్చు. వ్యక్తుల వల్ల లోలోపల మురికి, అమానుషత్వం, కల్తీ, అవినీతి, లంచగొండితనం, బాంబుల సంస్కృతి అన్నీ ఉంటాయి. ఇవన్నీ పై పొరలు. సముద్రంలో పైపై రొదలాగా! లోపల అంతా ప్రశాంతతే" ఇంత ఆశావహ దృక్పథాన్ని తెలుగు కథకు తెచ్చిన పెద్దిబొట్ల కథలను సరియైన 'పర్‌స్పెక్టివ్'లో చూస్తే ఆ కథల్లోని కరుణ, దు:ఖం, మానవీయ విలువల ఆరాటం నైరాశ్యం వల్ల కలిగినవి కావని ఆ విషాద బీభత్సాల వెనుక ప్రగతిశీల దృక్పథం, వ్యవస్థను దురంత పద్మవ్యూహాల రాజకీయాలతో కాక రవ్వంత మానవీయ అనురాగం వల్ల మార్చవచ్చుననే విశ్వాసాన్ని ప్రోది చేస్తాయి. 'అన్నదాతా సుఖీభవ'లో తనకు పిత్రార్జితం ఏమీ మిగల్చక దేశం అంటూ, దానధర్మాలంటూ ఆస్తిని తండ్రి తగలేశాడని కోపగించుకునే ముకుందరావు స్వాతంత్ర్య సమరయోధుడైన తండ్రిపేరు చెప్పుకునే లాభపడి సంపన్నుడైన సంగతి మాత్రం వెల్లడించాడు. ముకుందరావు మిత్రుడు పురుషోత్తం చెప్పిన కథలో డబ్బంతా పోగొట్టుకుని ఊరుకాని ఊళ్లో తాను నిస్సహాయుడైనప్పుడు దేవాలయంలో అన్నదాన పథకం కింద చేసిన భోజనం ముకుందరావు పేరున ఆయన తండ్రి నిత్యాన్నదానానికై ఎప్పుడో ఏర్పరచిందేనని తెలిసినప్పుడు పాఠకుడికీ చిత్రమైన వెలుగు కనిపిస్తుంది. 'దయ్యం పట్టినవాడు' చిత్రమైన కథ. ఆత్మీయమైన మిత్రులే అనంతరామయ్య, కొళందవేలు. ఓ కాగితం మీద కొన్ని మాటలు రాసి ఇది పంచదార, ఇది తేనె, ఇది చెరకుగడ అంటూ కొళందవేలు అనంతరామయ్యకు చూపుతాడు. ఇదే భాష? అంటే పోర్చుగీసు భాష అంటాడు. "అయితే ఆ భాషలోనే నా మిత్రుడు అనంతరామయ్య వట్టి మూర్ఖుడు, అజ్ఞాని, మందమతి" అని రాయి అంటాడు వ్యంగ్యంగా అనంతరామయ్య. అలా రాయడానికి అభ్యంతరం ఏముంటుంది ఉన్న మాటేగా అది' అంటూ రాస్తాడు కొళందవేలు. సరిగ్గా తను చెప్పినట్టే రాసి ఉన్న మాటేగా అది అన్నందుకు ఉన్నఫళాన అనంతరామయ్యకు కోపం వస్తుంది. ఇక అప్పట్నుండి అతనిపై కోపం, ఏహ్యత పెంచుకుని తప్పించుకు తిరుగుతాడు. కొళందవేలుకు జ్వరమన్నా వెళ్లడు. కొళందవేలు మరణిస్తాడు. భార్య, చెల్లెలు వచ్చి ఇంట్లో కొళందవేలు రాసిన కాగితం చూసి అది పోర్చుగీసు భాషేనని, కిందరాసిన వాక్యం మా అనంతరాముడి మనసు తేనెవలె, పంచదార వలె, చెరుకుగడవలె తీపి అని అర్థం అని చదివి నవ్వుతుంది. తెలియని భాష మనిషికీ మనిషికీ మధ్య ఒకటుంటుంది. మనిషిని విశ్వసించకుండా తెలియని భాషను విశ్వసించి అపార్థం చేసుకోవడం అనర్థదాయకం. లిపి చేసే చిలిపి పనులు కూడా అనుబంధాలకు అఘాతం కావచ్చు అని తేటతెల్లం చేసే కథ ఇది. మంచుబొమ్మ, ముస్తఫా, చెప్పుల జత, లిక్కర్ గాంధీ, మనీప్లాంట్, కాలుతున్న పూలతోట వంటి సుబ్బరామయ్యగారి మంచి కథలెన్నో ఈ రెండవ సంపుటిలో ఉన్నాయి. సుబ్బరామయ్య గారి కథలు చదవడం అంటే విలువైన మనిషినీ, జీవితాన్ని కలిసి కరచాలనం చేయడమే.

పెద్దిబొట్ల సుబ్బరామయ్య కథలు (రెండవ సంపుటం) - పెద్దిబొట్ల సుబ్బరామయ్య, ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్-1, వెల : 100/-.

- సుధామ

నిశాచరి

చిన్నారులూ! గుడ్లగూబను మీరెప్పుడైనా చూశారా? కళ్లు గుండ్రంగా తీక్షణంగా ఉండడం వల్ల దానికి ఆ పేరు వచ్చింది. సూర్యాస్తమయానికి ముందే మిగతా పక్షులు గూళ్లకు చేరుకుంటాయి. గుడ్లగూబ మాత్రం పగలంతా చెట్టుమీద విశ్రాంతి తీసుకుంటుంది. చీకటి పడగానే వేటకు బయలుదేరుతుంది. రాత్రివేళ ఇది గాలిలో ఎగురుతూ చిన్నా చితకా జంతువులను క్రిమికీటకాలను తింటుంది. గుడ్లగూబ కంటిచూపు మిగతా పక్షుల కంటే ఎన్నోరెట్లు శక్తివంతమైనది. దీని గోళ్లు పదునుగా వంకర తిరిగి ఉంటాయి. ఎలుక లాంటి జంతువు దొరికితే క్షణాల్లో చీల్చి చెండాడి తినేస్తుంది. ఇది పగలు చెట్ల కొమ్మల మీద నిద్రిస్తుంది. దీని ఈకలు కొమ్మల రంగులో కలిసిపోయి ఉండడం వల్ల శత్రువులు గుర్తించడం కష్టం. గుడ్లగూబ స్వేచ్ఛాజీవి. తనకంటూ ప్రత్యేకంగా గూడు కట్టుకోదు. చెట్ల తొర్రలలోనో, భవనాల మూలల్లోనూ ఆడ గుడ్లగూబ గుడ్లు పెడుతుంది. పిల్లల పోషణ బాధ్యతలను తల్లీదండ్రీ సమానంగా తీసుకుంటారు. గుడ్లగూబ గుడ్డు గుండ్రంగా ఉంటుంది. వీటి పిల్లలు రెండు నెలల్లోనే గాలిలో ఎగరడం నేర్చుకుంటాయి. గుడ్లగూబ ఆహారాన్ని నమలలేదు. అందుకని దొరికిన జంతువును చంపేసి మింగేస్తుంది. మాంసాన్ని అరిగించుకున్న తర్వాత ఎముకలను, చర్మాన్ని పొట్టలోనుంచి నోట్లోకి తెచ్చుకుని ఊసేస్తుంది. గుడ్లగూబ 12 సెంటీమీటర్ల నుంచి 70 సెంటీమీటర్ల ఎత్తు వరకు ఉంటుంది. మగపక్షి కంటే ఆడపక్షి పరిమాణం పెద్దగా ఉండటం విశేషం.



చుక్కల్లో చిక్కిందెవరోచ్!

తెలియాలంటే 1 నుంచి 40 వరకు చుక్కలు కలిపేస్తే పోలా!



ఒకేలా...

నేస్తాలూ...ఇక్కడ ఆరు కేకులున్నాయికదా. అన్నీ చూడ్డానికి ఒకేలా వున్నా రెండు మాత్రమే కవల కేకులు. అంటే రెండు మాత్రమే అచ్చుగుద్దినట్టు ఒకేలా వుంటాయన్నమాట. ఇంతకీ ఆ రెండు కేకులు ఏవో చెప్పకోండి చూద్దాం.



రంగులు అద్దేద్దాం..!

బాలనేస్తాలు

దారి ఏది?

చిన్నారులూ ఇక్కడ ఒక కోళ్ల ఫారం వుంది. అందులో కోళ్లు గుడ్లు పెట్టాయి. వాటిని ఒక బుట్టలో సేకరించి తీసుకెళ్లాలి. అయితే కోళ్లఫాగానికీ గుడ్ల బుట్టకూ మధ్యన బోలెడన్ని గజిబిజి దారులున్నాయి. వాటిలో ఒకటంటే ఒకటే సరైన దారి వుంది. మరి అది ఏదో చెప్పండి.



8 తేడాలు ఏవి?

పిడుగులూ! కింది రెండు బొమ్మలూ ఒకేలా వున్నాయా! అలా అనుకుంటే పప్పులో కాలేసినట్టే. అందులో 8 తేడాలున్నాయి. వాటిని పెన్నుతో గుర్తించండి చూద్దాం. ఎన్ని తేడాలు గుర్తిస్తే మీకు అన్ని మార్కులు వచ్చినట్టు.

ఏమేం వున్నాయి?

చిన్నారులూ.. ఏంటలా విచిత్రంగా చూస్తున్నారు? ఇదేం జంతువబ్బా? అనా! మీకు ఒక టెస్ట్ పెడదామని ఈ విచిత్ర జీవిని మీ ముందుకు తీసుకొచ్చాం. దీన్ని బాగా పరిశీలనగా చూసి ఇందులో ఏమేం జంతువుల శరీర భాగాలున్నాయో చెప్పాలి. మరి రెడీనా!

నేర్చుకుందాం

హాయ్! మీరు రోజూ స్కూలుకు బూట్లు వేసుకెళతారు కదా. మరి బూట్లు బొమ్మలు వేయడం వచ్చా? రాదా! అందుకే ఇవాళ నేర్చేసుకోండి.



మాటల కోట - 59

రూపకల్పన : కర్లపాలెం



అడ్డం :

1. ఉరి శిక్షలో తలతీసేవాడు (3)
3. బాపు ప్రాణ స్నేహితుడు (3)
8. చదువు (2)
9. జీవము (3)
10. మౌనంగా ఉండేవాడు (2)
13. ముహూర్తము (3)
14. విజయం (3)
15. తెలుగు 'మకాన్' (3)
18. 'కనికరం'లోని చేయి (2)
19. ఉడికిన బియ్యపుగింజ (3)
20. పేక దస్త్రంలో ఎ (2)
21. కాపీ (3)
23. పట్టంటే దీనిదే పట్టు (3)
24. మణిరత్నం సినిమా, బేబీ షాలినికి మంచి గుర్తింపు తెచ్చిన చిత్రం. పాతతరం కథానాయిక కూడా (3)

నిలువు :

2. నష్టం కానిది (2)
4. ముసల్మానుల పవిత్ర స్థలం (2)
5. కవి పుత్రిక (3)
6. కేంద్ర ఆర్థిక మంత్రి ఈ ముఖర్జీనే (3)
7. యూపీయే ఛైర్‌పర్సన్ (3)
11. సాలెచీరెలు నేసేది దీనిమీదే (3)
12. ఎటు చూసినా అదే వయ్యారం (3)
16. టంగుటూరి ప్రకాశం.... (3)
14. మాతాపితలలో ముందు వందనీయురాలు (2)
17. లోపం (3)
19. మృగం వికృతి రూపం (3)
21. నడువూ (2)
22. ధాన్యకణం ఒకటి (2)

మాటలకోట - 58 జవాబు

1 జ	య	2 తే	■	3 తి	4 ల	కం	■	5 పా
నం	■	నీ	■	■	క్క	■	6 రొం	ప
■	■	7 రు	మా	8 లు	■	9 జె	పి	■
10 ఆ	11 గం	■	■	12 క	బా	డి	■	■
13 నం	గి	■	■	లు	■	■	14 మా	15 వి
■	■	16 అం	బి	క	■	■	17 త	ష్ప
■	18 దం	చు	■	19 లు	బ్ధ	20 ము	■	■
21 నా	డు	■	22 తా	■	■	ల్లం	■	23 వం
రు	■	24 గ	ర	ళం	■	25 గి	రీ	శం

ఢాం! ఢాం! ఢాం!



చాలా కాలం క్రితం నల్లమల అడవులలో ఒక కోతి ఉండేది. అది చాలా అల్లరిది. ఒక రోజు అడవికి దగ్గరలో ఉన్న ఓ గ్రామానికి బయలుదేరింది.

దారిలో దానికి ఓ కాణి దొరికింది. సంతోషంతో కోతి ఎగిరి గంతేసింది. కాణీని పట్టుకుని గంతులు వేస్తూ కోమటి అంగడికి వెళ్లింది. దాంతో బఠాణీలు కొనుక్కుంది.

బఠాణీల పొట్లాం పట్టుకుని పాట పాడుకుంటూ దారి పక్కనే ఉన్న చెట్టెక్కి ఓ కొమ్మ మీద కూర్చుని ఒక్కొక్క గింజ తీసుకుని తినసాగింది. హఠాత్తుగా దాని చేతిలోంచి బఠాణీ గింజ జారింది. చెట్టు కింద ముళ్ళపొదల్లో పడింది.

కోతి వెంటనే చెట్టు దిగింది. చేతిలోని బఠాణీల పొట్లాన్ని చెట్టు తొర్రలో దాచి పొదలోకి దూరింది. బఠాణీ కోసం వెతికింది. అయితే దొరకలేదు. సరే బయటికి వద్దామా అంటే ఇరుక్కుపోయింది. చివరికి ఎలాగోలా తను బయటికి రాగలిగింది కానీ దాని తోక ముళ్ళపొదలో ఇరుక్కుంది. ఓ పొడవాటి ముల్లు కోతి తోకలో దూరింది. కోతి తోకను పట్టుకుని గట్టిగా లాగింది. తోక బయటికి వచ్చింది. కానీ ముల్లు విరిగి కొంత భాగం కోతి తోకలో ఉండిపోయింది. విరిగిన ముల్లు వల్ల కోతి గిలగిల్లాడింది. బాధతో కుప్పిగంతులు వేసింది.

అదే సమయంలో ఆ దారిన ఓ మంగలి పోతున్నాడు.

అతడ్ని చూడగానే కోతి అతడ్ని ఆపి-"మంగలి మామా ! మంగలి మామా! నా తోకలో ముల్లు విరిగింది. దయచేసి తీయవా? ముల్లు తీస్తే చెట్టు తొర్రలో దాచిన బఠాణి పొట్లం ఇస్తాను" అంది.

"సరే !"అంటూ అతను ముల్లు తీయబోయి పొరబాటున తోక కోసేశాడు.

అది చూసి కోతి గయ్‌మంటూ లేచింది.

"ముల్లు తీయమంటే నా అందమైన తోకను కత్తిరిస్తావా? నా తోక ఇస్తావా? నీ కత్తి ఇస్తావా?" అంటూ పేచీకి దిగింది. మంగలి బిక్క మొహం వేసుకుని కత్తి ఇచ్చి ఇంటి దారిపట్టాడు.

కోతి కత్తి పట్టుకుని అక్కడి నుంచి హుషారుగా బయలుదేరింది. దారిలో ఓ ఆడమనిషి కట్టెలు విరుస్తూ కనిపించింది. కోతి వెంటనే ఆమెతో -"అత్తమ్మా ! ఎవరైన కట్టెలు కత్తితో నరుకుతారు కానీ చేత్తో విరుస్తారా?" అంటూ కత్తి ఇచ్చింది.

మహిళ కత్తితో కట్టెలు కొట్టసాగింది. నాలుగు కర్రలు నరికేసరికి కత్తి పుటుక్కుమని విరిగిపోయింది. అది చూసి కోతి "నా కత్తి నాకివ్వు. లేదా కొట్టిన కట్టెలు నాకివ్వు" అంటూ గగ్గోలు పెట్టింది.

ఆమె చేసేదేమీ లేక కోతికి కట్టెలు ఇచ్చింది.

కోతి సంతోషంగా కట్టెల మోపును నెత్తి మీద పెట్టుకుని "లలలాం లలలాం భలే ఛాన్సులే"అంటూ పాట పాడుకుంటూ ఊరి దారి పట్టింది. దార్లో చెట్టు కింద ఓ ముసలమ్మ పొయ్యి మీది మూకుడులో నూనె పోసి, పొయ్యి కింద పిడకలు పెట్టి వెలిగించడానికి తంటాలు పడుతోంది.

కోతి ముసలమ్మ దగ్గరికి వెళ్ళి "అవ్వా, అవ్వా ! పిడకలు ఎప్పుడు మండాలి? ఇదిగో కట్టెలు" అంటూ కట్టెలు ఇచ్చింది.

ముసలమ్మ ఆనందంగా కట్టెలు పొయ్యిలో పెట్టింది. కొద్ది సేపట్లోనే కట్టెలన్నీ కాలిపోయాయి.

అది చూసి కోతి "అయ్యో, అయ్యో, నా కట్టెలన్నీ కాలిపోయాయే. ఇదిగో ముసలీ! కట్టెలన్నా ఇవ్వు, లేద నూనైనా ఇవ్వు"అంటూ గొడవ పెట్టుకుంది.

ముసలమ్మ సణుగుతూ నూనె ఇచ్చింది.

కోతి నూనె తీసుకుని ముందుకు సాగింది. దారిలో ఒకామె అప్పడాలు వేయిస్తోంది. కోతి అక్కడికి చేరుకునే సమయానికి ఆమె దగ్గర నూనె అయిపోయింది. దాంతో ఆమె అప్పడాలను నిప్పల మీద కాల్చసాగింది. అది చూసి కోతి "పిన్నీ, అప్పడాలు నూనెలో కాలిస్తేనే బాగుంటాయి. ఇదిగో నూనె" అంటూ నూనె ఇచ్చింది. ఆమె అప్పడాలన్నీ కాల్చేసరికి నూనె అయిపోయింది. వెంటనే కోతి" నూనె ఇస్తావా? అప్పడాలు ఇస్తావా?"అంటూ పోట్లాట పెట్టుకుంది. ఆమె నోరు మూసుకుని కోతికి కొన్ని అప్పడాలు ఇచ్చింది. కోతి సంబరంగా కరకరమని అప్పడం నములుతూ అక్కడి నుంచి బయలుదేరింది. దారిలో తల్లీకూతుళ్ళు కనిపించారు. అమ్మాయి ఏడుస్తూ ఉంది.

అది చూసి వెంటనే కోతి "పిల్ల ఏడుస్తుంటే ఊరుకున్నావేం వదినా, ఇదిగో ఈ అప్పడాలు ఇవ్వు" అంటూ అప్పడాలు పిల్ల చేతిలో పెట్టింది.

ఆ పిల్ల నిముషంలో అప్పడాల్ని కరకరా నమిలేసింది.

కోతి "నా అప్పడాలు ఇస్తావా లేదా పిల్లనిస్తావా" అంటూ తగువు పెట్టుకుంది.

తల్లి పిల్లను కోతికి అప్పగించింది. కోతి పిల్లను వెంటబెట్టుకుని బయలుదేరింది. దారిలో ఓ రైతు కనిపించాడు. అతని దగ్గర డప్పు ఉంది. అతడు విచారంగా ఉండటం చూసి కోతి "ఏమైందన్నా?"అని అడిగింది. "నేను డప్పు వాయించేసరికి నా ఎద్దు పారిపోయింది. ఇప్పుడు పొలం ఎలా దున్నాలా అని ఆలోచిస్తున్నాను" అన్నాడు రైతు.

"ఈ పిల్లను నాగలికి కట్టి పొలం దున్నుకో"అంది కోతి.

రైతు సరేనని పిల్లను నాగలికి కట్టబోయాడు. అంతలో ఆ పిల్ల తప్పించుకుని పారిపోయింది. రైతు పిల్ల వెంట పోబోయాడు. కోతి వెంటనే అతడిని పట్టుకుని "నా పిల్లను నాకు ఇవ్వు లేదా నీ డప్పు ఇవ్వు" అంటూ పేచీ పెట్టుకుంది.

రైతు బిక్కమొహం వేసుకుని కోతికి తన డప్పు ఇచ్చాడు.

కోతి డప్పు తీసుకుని చెంగున చెట్టు మీదికి ఎక్కి ఓ కొమ్మ మీద కూర్చుని డప్పు కొట్టుకుంటూ -

"తోక పోయే... కత్తి వచ్చె ...ధాం! ధాం! ధాం!
కత్తి పోయే ... కట్టెలు వచ్చె ...ధాం! ధాం! ధాం!
కట్టెలు పోయే ...నూనె వచ్చె ...ధాం! ధాం! ధాం!
నూనె పోయే ...అప్పడం వచ్చె... ధాం! ధాం! ధాం!
అప్పడం పోయే... పిల్ల వచ్చె ...ధాం! ధాం! ధాం!
పిల్ల పోయే ...డప్పు వచ్చె... ధాం! ధాం! ధాం!" అంటూ పాడసాగింది.

-రంగనాథ రామచంద్రరావు

కేశ బాలిక

ఈ పాపను చూస్తుంటే ఏమనిపిస్తోంది?! బోలెడంత ఆ...శ్చర్యంగానా! మరి ఒక్కోసారి తప్పదు! వాస్తవం కళ్లెదుటే కనిపిస్తున్నా నమ్మశక్యం కాదు. కానీ విశ్వసించక తప్పదు. పాప పేరు సుపత్రా ససుఫన్. థాయ్‌లాండ్ వాసి. తనకు పదకొండేళ్లు. అందరు చిన్నారుల్లాగే స్కూలు...ఆటలు...పాటలు...చదువు... అన్నీ మామూలే. కాకపోతే... ఒకటే లోపం! చిన్నప్పటి నుంచీ తనకు నెత్తిమీదే కాకుండా మొహం, మెడ, వీపు మీద వెంట్రుకలు పెరగసాగాయి. అమ్మానాన్నా కంగారుపడిపోయి వైద్యులకు చూయించారు. ఫలితం లేకపోయింది. జన్యులోపం ఇందుకు కారణమైవుండొచ్చన్నారు. ఇరుగుపొరుగే కాదు! స్కూల్లో కూడా తనకో ప్రత్యేకత కల్పించిన ఘనత కేశాలదే. ఆకతాయి పిల్లలు తనను ఏడిపించినా అదే ఆమెకో గుర్తింపు తెచ్చి పెట్టింది. 2010 గిన్నిస్ బుక్‌లో చోటు కల్పించింది. ఇందుకు మాత్రం సుపత్రా చాలా సంతోషిస్తోంది. ✡

మదనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శిగా, పుంగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శిగా నా హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులు

30-6-2011వ తేదీన పదవీ విరమణ చేశాను. ఇందుకు నాకు సహకరించిన అధికారులకు, ప్రజాప్రతినిధులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు, కార్యాలయ సిబ్బందికి మా ప్రత్యేక ధన్యవాదములు

మదనపల్లి మార్కెట్ యార్డునందు చేపట్టిన అభివృద్ధి పనులు	బి. కొత్తకోట మార్కెట్ యార్డునందు చేపట్టిన అభివృద్ధి పనులు
రూ. 50 లక్షలతో 16 టమోటా మండీల నిర్మాణం	రూ. 3 లక్షలతో మార్కెట్ యార్డు నందు సి.సి. రోడ్డుల నిర్మాణం
రూ. 3 లక్షలతో మార్కెట్ యార్డు నందు మంచినీటి సరఫరా	రూ. 3 లక్షలతో మార్కెట్ యార్డు నందు ఫ్లోరింగ్ నిర్మాణం
రూ. 30 లక్షలతో మార్కెట్ యార్డు నందు సి.సి. రోడ్డుల నిర్మాణం	రూ. 3 లక్షలతో మార్కెట్ నందు ప్లాట్ ఫారమ్‌ల నిర్మాణం
రూ. 3 లక్షలతో మదనపల్లి మార్కెట్‌లో కాంపౌండ్ వాల్ నిర్మాణం	రూ. 3 లక్షలతో మార్కెట్ యార్డులో అసంపూర్తిగా ఉన్న గోడ నిర్మాణం
రూ. 32 లక్షలతో మార్కెట్ నందు రెండు ప్లాట్ ఫారమ్‌ల నిర్మాణం	రూ. 3 లక్షలతో మార్కెట్ యార్డులో భూమి చదును.

నిమ్మనపల్లి మార్కెట్ యార్డునందు చేపట్టిన అభివృద్ధి పనులు :

రూ. 3 లక్షలతో మార్కెట్ యార్డు కాంపౌండ్ గోడ నిర్మాణం
రూ. 30 లక్షలతో మార్కెట్ యార్డు నందు అప్రోచ్ రోడ్ నిర్మాణం

పుంగనూరు మార్కెట్ యార్డునందు చేపట్టిన అభివృద్ధి పనులు :

రూ. 90 లక్షలతో 40 షాపు రూముల నిర్మాణం
రూ. 20 లక్షలతో 6 షాపు రూమలు నిర్మాణం
రూ. 20 లక్షలతో ప్లాటు ఫారమ్ ల నిర్మాణం

యం. ఖాదర్‌ఖాన్
వ్యవసాయ మార్కెట్‌యార్డు
కార్యదర్శి, మదనపల్లి, పుంగనూరు

యం. ఖాదర్‌ఖాన్
వ్యవసాయ మార్కెట్‌యార్డు
కార్యదర్శి, మదనపల్లి, పుంగనూరు